
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం BHADRADRI KOTHAGUDEM


గురువారం, 5 సెప్టెంబరు 2024



టీడీపీ నేత 'కుతుంబాక' కన్నుమూత

- పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు సన్నిహితుడిగా గుర్తింపు
- టీడీపీ ఖమ్మం జిల్లా తొలి అధ్యక్షుడిగా బాధ్యతలు
- సంతాపం తెలిపిన పలువురు ప్రముఖులు
- నేడు వి.వెంకటాయపాలెంలో అంత్యక్రియలు





పద్మావతినగర్‌లో ఇంట్లో పేరుకుపోయిన బురదను తొలగిస్తున్న దృశ్యం



బొక్కలగడ్డలో వరద బాధితులకు భోజనం అందజేస్తున్న దృశ్యం



రిలీఫ్ కిట్లు

అటు కన్నీళ్లు.. ఇటు ఓదార్పు

మున్నేరు వరద విలయం నుంచి కోలుకుంటున్న ఖమ్మం నగరం

- ఇళ్లకు చేరుతున్న వరద బాధితులు
- పేరుకుపోయిన బురదను తొలగించడానికి అష్టకష్టాలు
- సర్వం కోల్పోయి బావురుమంటున్న వేలాదిమంది జనం
- జోరుగా సాగుతున్న సర్కారు సహాయక చర్యలు
- నిత్యావసరాల పంపిణీ... పలుచోట్ల భోజనాలు..
- పారిశుధ్య చర్యలో వెయ్యి మంది సిబ్బంది నిమగ్నం
- బాధితుల గుర్తింపుపై కొనసాగుతున్న ఇంటింటి సర్వే
- మంత్రులు తుమ్మల, పొంగులేటి ప్రత్యక్ష పర్యవేక్షణ



పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న ఎంపీ రఘురాం రెడ్డి

ఖమ్మం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మున్నేరు ఉగ్రరూపం, వరద బీభత్సంతో అతలాకుతలమైన ఖమ్మం నగరం క్రమంగా కోలుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మున్నేరు ఉధృతితో వేలాది ఇళ్లు జలమయం కావడంతో అనేక కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఇప్పట్లో ఖమ్మం కోలుకుంటుందా అనే ప్రశ్నలనుంచి అధికార యంత్రాంగం, ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో క్రమంగా కోలుకునే పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వం, అధికారులు, మంత్రులు స్వచ్ఛంద సంస్థలు ఇస్తున్న భరోసాతో బాధితులు ఉపశమనం పొందుతన్నారు.

వందేళ్ల చరిత్రలో మున్నేరు కనీవినీ ఎరుగని రీతిలో 36 అడుగుల ఎత్తులో ప్రవహించడంతో ఖమ్మంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, మోతీనగర్, ధంసలాపురం, కాల్వొడ్డు, మమతారోడ్డు, కవిరాజనగర్, జూబ్లీక్లబ్ ఏరియాతో పాటు ఖమ్మంరూరల్ మండలంలోని పెద్దతండా, కరుణగిరి, జలగంనగర్, రాజీవ్‌గృహకల్ప, రామన్నపేట, దానవాయిగూడెం తదితర కాలనీలన్నీ జలమయం అయ్యాయి. మున్నేరు పరివాహకంలోని ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, చింతకాని, మధిర, మధిరరూరల్ ఎర్రుపాలెం, మండలాల్లో వరద బీభత్సం సృష్టించింది. ఫలితంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 7090 ఇళ్లు ముంపునకు గురికాగా ఖమ్మంపట్టణంలో 5,750 ఇళ్లు ముంపునకు గురయ్యాయి. ఇందులో కొన్నిపూర్తిగా పడిపోయాయి. మొత్తం 39 పునరావాస కేంద్రాల ద్వారా సహాయ కార్యక్రమాలు అందించగా వరద తగ్గడంతో చాలామంది ఇళ్లకు వెళ్లారు. (మిగతా 6వ పేజీలో)

18 డివిజన్లలో వరద బాధితులు

మున్నేరు వరద పోటుతో ప్రజలు తేరుకునే లోపే తీవ్ర నష్టం వాటిల్లింది. ఖమ్మం నగరంలోని 13 డివిజన్లలో కవిరాజ్‌నగర్, ధంసలాపురం, కొత్తూరు, శ్రీనివాస్‌నగర్, ప్రకాష్‌నగర్, రాజేంద్ర నగర్, సుందరయ్యనగర్, పంపింగ్‌వెల్ రోడ్డు, రంగనాయకులగుట్ట, గ్యాస్ గోడౌన్, మోతి నగర్, ట్రాంక్ రోడ్డు, డీ మార్ట్, గొల్లబజార్, బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, నయాబజార్, గణేష్‌నగర్, మోకల నారాయణనగర్, పద్మావతినగర్, సారధినగర్, ఎఫ్‌సీఐ గోడౌన్, దానవాయిగూడెం, రామన్నపేట ప్రాంతాలు పూర్తిగా జలదిగ్బంధంలోకి వెళ్లాయి. మరో ఐదు డివిజన్లలో పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 60 డివిజన్లుండగా వాటిలో18 డివిజన్లు ఇటు మున్నేరు వరద పోటు, భారీ వర్షాలకు అతాలకుతలమయ్యాయి. రాత్రి సమయంలో ఒక్కసారిగా ఇళ్లపై వరద పడటంతో కట్టుబట్టలతో పిల్లాపాపాలతో మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలు ప్రాణాలర చేతిలో పెట్టుకొని రోడ్డున పడ్డారు.

పునరావాసంలో భేష్

మున్నేరుకు వరద పోటు తర్వాత తిరిగి బాధితులు ఇళ్లకు వెళ్లటానికి బురద సమస్యగా మారింది. మూడు రోజులుగా నివాసాలు శుభ్రం చేస్తున్నా బురద తొలగక పోవటంతో బాధిత కుటుంబాలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్వర్ణభారతిలో 300, ధంసలాపురంలో 2000, రామన్నపేటలో 2,400, మహిళా కాలేజీలో 2700, జూబ్లిక్లబ్‌లో 300 మొత్తం 7,700 మంది బాధితులకు బసతో పాటుగా భోజనం, అల్పాహారం అందిస్తున్నారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అక్కడే భోజనం చేసి పర్యవేక్షణ చేస్తున్నారు. మరోవైపు ఖమ్మం జిల్లా పూర్వ కలెక్టర్లు, ప్రస్తుత వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. నల్గొండ, వరంగల్, ఇతర ప్రాంతాల నుంచి వారి పరిదిలోని శాఖల అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులను ఖమ్మానికి రప్పించి నేరుగా వారితో బాధిత ప్రాంతాల్లో సేవలు అందేలా ఆదేశాలిచ్చి పర్యవేక్షణ చేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను సమన్వయం చేస్తూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆర్వీ కర్ణన్ ఆదేశాలమేరకు హైదరాబాద్ నుంచి 20 వైద్య బృందాలు వచ్చి ఖమ్మంలో బుధవారం నుంచి వైద్య సేవలు ప్రారంభించాయి.

పారిశుధ్య కార్యక్రమాలు

కేఎంసీలో 650, వరంగల్ 300, నల్గొండ 50, గ్రామ పంచాయతీల నుంచి 150 మొత్తం 1150 మంది పారిశుద్య కార్మికులను 13 డివిజన్లలో ఏర్పాటు చేయించి వారితో పారిశుద్య కార్యక్రమాలు చేపట్టటంతో పారిశుద్యం ఓ కొలిక్కి వచ్చింది. అలాగే 37 జేసీబీలు 60 ట్రాక్టర్లు, 59 వాటర్ ట్యాంకులు, 30 స్వచ్ఛ ఆటోలతో పారిశుద్య చెత్త తరలింపు చేపట్టారు. 559 చేతి పంపులు, 78 విద్యుత్ బోర్లు, 9 వాటర్ ట్యాంకర్లు, 13 అద్దె వాటర్ ట్యాంకర్లు, గ్రామ పంచాయతీల నుంచి తెప్పించిన మరో 40 ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తున్నారు.

బ్యాంకు ఖాతాల సేకరణ

ఖమ్మంలో రెండు రోజులుగా సాగిన 14 రెవెన్యూ బృందాల ద్వారా జరిగిన సర్వేలో ఇప్పటి వరకు 4,229 నివాసాల సర్వే పూర్తి చేశారు. ఒక్కో నివాసంలో ఉంటున్న కుటుంబాల బ్యాంకు ఖాతాలను సేకరించారు. ప్రభుత్వం అందించే ఎక్స్‌గ్రేషియాను దళారుల చేతికి వెళ్లకుండా నేరుగా బాధితుల బ్యాంకు ఖాతాలోకి జమజరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో 5వేల కుటుంబాల వరకు సర్వే పూర్తి కావాల్సి ఉంది.

- ఖమ్మం సంక్షేమ విభాగం

6వ తేదీ వరకు సెలవులు

ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 4: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదేశాలతో జిల్లాలోని ఖమ్మం, మధిర, పాలేరు నియోజకవర్గల పరిధిలోని సమస్త ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల విద్యా సంస్థలకు బుధవారం నుంచి శుక్రవారం వరకు ప్రభుత్వం సెలవులను ప్రకటించారు. శనివారం వినియకచవితి, 8న ఆదివారం కావటంతో సోమవారం తిరిగి విద్యాసంస్థలు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని, మండల విద్యాశాఖ అధికారులు వారి పరిధిలోని అన్ని యాజమాన్యాలకు ఆదేశాలు చేరవేసి అమలు చేయాలని డీఈవో తెలిపారు.

సర్టిఫికెట్ల జారీకి 11న శిబిరం

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 4: భారీ వర్షాలు, వరదల కారణంగా సామగ్రితో పాటు సర్టిఫికెట్లు పోగొట్టుకున్న వారికి ఈ నెల 11వ తేదీన ప్రత్యేక శిబిరం నిర్వహించి సర్టిఫికెట్ల జారీకి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ బుధవారం తెలిపారు. విదేశాల్లో అడ్మిషన్లు, అత్యవసర అవసరాలు ఉన్నవారు తమ హాట్ లైన్ నెంబర్ తెలియజేస్తే వారికి ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. మిగిలిన వారు 11న నిర్వహించే శిబిరానికి హాజరు కావాలని తెలిపారు. పాస్‌పోర్టు, విద్యార్హతల సర్టిఫికెట్లు పోగొట్టుకున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

డీసీసీబీలో ఇద్దరు జీఎంల సస్పెన్షన్

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబరు 4: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో వచ్చిన పలు ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో జనరల్ మేనేజర్లు నర్మద, పద్మావతిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర కో ఆపరేటివ్ రిజిస్ట్రార్ ఆదేశాలు ఇచ్చారు. డీసీసీబీలో బోర్డు సభ్యుల ఫిర్యాదుతో పాటు వచ్చిన ఆరోపణలపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టెస్కాబ్ అధికారులను విచారణకు ఆదేశించగా కోఆపరేటివ్ రిజిస్ట్రార్ విచారణ నిర్వహించారు. మంగళవారం సీఈవోను సస్పెండ్ చేయగా, బుధవారం జీఎంలపై వేటు వేశారు. ఇటీవల బోర్డు సమావేశంలో ఖమ్మం డీసీసీబీలో రూ.78లక్షలు పాత బకాయిల పేరుతో సిబ్బందికి చెల్లింపులు చేశారని, అలాగే సహకార సంఘాల సభ్యులకు బీమా నిమిత్తం ప్రభుత్వం రంగ బీమా కాకుండా ఎక్కువ ప్రీమియంతో సుమారు రూ.7.60కోట్లు చెల్లించారని, సహకార సంఘాల నుండి డీసీసీబీ అనుమతి లేకుండా ఈ ప్రీమియంచెల్లించారని, రైతు రుణమాఫీలో అర్హులైన వారి పేర్లను అనర్హులుగా చేర్చారని, రుణమాఫీలో అర్హులపేర్లు తొలిగించారని ఆరోపణలు వచ్చిన విషయం విదితమే.

రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 4: జిల్లాలో ఇటీవల భారీ వర్షాల నేపథ్యంలో వరద ముంపునకు గురై మృతి చెందిన ఒక్కొక్కరికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చొప్పున ఆరుగురికి రూ. 30 లక్షలు మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఈ ఎక్స్‌గ్రేషియాను మృతుల కుటుంబ సభ్యులకు ఇప్పటికే కొంతమందికి అందించినట్లు తెలిపారు. మిగతా కుటుంబాలకు సైతం అందించనున్నట్లు తెలిపారు. మధిర మండలం దెందుకూరుకు చెందిన నన్నెబోయిన పద్మావతి, ఎర్రుపాలెం మండలం భీమవరానికి చెందిన మలిశెట్టి సాంబశివరావు, కూసుమంచి మండలం నాయకన్‌గూడేనికి చెందిన దంపతులు ఎస్‌కే యాకూబ్, ఎస్‌కే సైదాబీలకు, సింగరేణి మండలం గంగారం తండాకు చెందిన మృతులు నునావత్ మోతీలాల్, నునావత్ అశ్వినిల కుటుంబ సభ్యులకు అందించనున్నట్లు తెలిపారు.



ఖమ్మంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

వరద బాధితులకు పూర్తి అండ

- వ్యక్తిగత ఖాతాల్లోకి నేరుగా నగదు రూపేణ సాయం జమ
- ఖమ్మం నగరంలో 5 వేల ఇళ్లు వరదలో మునక
- యుద్ధ ప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వివరాలు : 6లో



కూసుమంచిలో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

మాజీ మంత్రి కబ్జాలతోనే నష్టం

- కాల్వలు కబ్జా కాకుంటే ఇంతనష్టం జరిగేది కాదు
- సీఎం ప్రశ్నించినా ఇంతవరకు వాళ్లు స్పందించలేదు
- ఖమ్మం వరదలను జాతీయ విపత్తుగా పరిగణించాలి
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు : 6లో



గొట్టిముక్కుల వెంకటేశ్వర్లు



కూరాకుల సైదయ్య



కె ఓంకార్

ఆదర్శ గురువులు

- రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురి ఎంపిక.. నేడు అవార్డుల ప్రదానం

కొణిజర్ల/ఏన్కూరు/ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 4: ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపికయ్యారు. కొణిజర్ల మండలం పెద్దగోపతి ఉన్నత పాఠశాలలో తెలుగు బోధిస్తున్న గొట్టిముక్కుల వెంకటేశ్వర్లు, ఏన్కూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కూరాకుల సైదయ్య ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం వీరు హైదరబాద్‌లో ఉత్తమ అవార్డు అందుకోనున్నారు. వీరితో పాటు కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న బాటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె ఓంకార్ ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు.

భద్రాద్రి జిల్లాలో కుండపోత

- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- కిన్నెరసాని 8గేట్లు ఎత్తి 50వేల క్యూసెక్కుల నీరు విడుదల
- భద్రాచలం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

కొత్తగూడెం, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీలోని పలు మండలాల్లో వర్షం దంచికొట్టింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలోవర్షం కురిసింది. ప్రధానంగా ఇల్లెందు, ఆళ్లపల్లి, గుండాల, టేకులపల్లి, మండలాల్లో భారీగా వర్షం కురిసింది. దీంతో వాగులు,వంకలు పొంగి ప్రవహించాయి. పలు గ్రామాలకు రాకపోలకు స్తంభించిపోయాయి. ఆళ్లపల్లి మండలంలో 7.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలోని కిన్నెరసాని, జల్లేరు, కోడెలవాగు, పాలవాగు, మూలమలుపు వాగు, ఊరవాగు, తునికిదొన్నెవర్రె, చింతలపడివాగు వరదు ఉధృతితో పొంగి ప్రవహించాయి. కిన్నెరసాని వాగుకు వరద ఉధృతి అత్యధికంగా రావడంతో పొంగడంతో జిల్లా కేంద్రాలనికి, మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. పాతూరు, పెద్దూరు, మర్కోడు, లొద్దిగూడెం, బాటన్ననగర్, లక్ష్మీపురం, ఆళ్లపల్లి రోడ్లు పెత్త ఎత్తున దెబ్బతిన్నాయి. వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. ఏడుమెలికల వాగు, మల్లన్నవాగు, మొర్రేడువాగు తదితర వాగులు పొంగి ప్రవహించాయి.

టేకులపల్లి మండలంలో జగంగాలపల్లికి చెందిన నారగోని సదాకర్ పశువులనుకాయడానికి వెళ్లి ఆ గ్రామ సమీపంలో ఉన్న బురదోనివాగులో గల్లంతయ్యాడు. టేకులపల్లి మండలంలోని పై భాగంలో కురిసిన వర్షం వల్ల మొర్రేడువాగు, నల్లవాగు, రాళ్లవాగు, పారికాయలవాగు, బుర్దోనివాగు పొంగి ప్రవహించాయి. బొమ్మనపల్లిలోని సాయమ్మ చప్టా పొంగింది. మద్రాసుతండా, కొండాంగలు బోడు మధ్య ఉన్న చప్టా పొంది ప్రవహించడంతో ఆగ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు ఉధృతంగా వరదనీరు రావడంతో 8గేట్లు ఎత్తి 54వేల క్యూసెక్కుల నీటిని బయటకు పంపించారు.



కిన్నెరసాని గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

భద్రాచలం వద్ద గోదావరి నదీ నీటి మట్టం గత రెండు రోజుల నుంచి పైన ఉన్న రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు నీటి మట్టం పెరుగుతోంది. బుధవారం సాయంత్రంకు 43.9అడుగులకు నీటి మట్టం చేరింది. దీంతో ప్రభుత్వం మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఇల్లెందులోని కొత్తబస్టాండ్ ఏరియా నుంచి బర్లపెంట ఏరియాకు వెళ్లే మార్గమధ్యలో బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తున్న బుగ్గవాగు నీరు ప్రవహించింది. దీంతో అయా ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. టేకులపల్లి మండలంలో ఎడతెరిపి లేకుండ కురుస్తున్న వర్షాల వల్ల తూర్పుగూడెం వాగుల కొట్టుకుపోతున్న యువకుడ్ని గ్రామస్తులు రక్షించారు. సింగరేణి ప్రాంతంలో కురివడంతో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఓపెన్‌కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి సైతం అంతరాయం జరిగింది. వర్షాల వల్ల సింగరేణి జిల్లా వ్యాప్తంగా 1.50లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం జరిగిందని చెప్పవచ్చు. జిల్లాలో ఆళ్లపల్లి మండలంలో 7. 6 సెం.మీ, లక్ష్మీదేవిపల్లిలో 4. 3 సెం.మీ, కరకగూడెం మండలంలో 4 సెం.మీ, దమ్మపేట మండలంలో 3సెం.మీ, చుంచుపల్లిలో 2.5సెం.మీ, జూలూరుపాడు మండలంలో 2. 5సెం.మీ, కొత్తగూడెం, ములకలపల్లి, గుండాల్లో 2సెం.మీ, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ 1. 5సెం.మీ, టేకులపల్లి, సుజాతనగర్ 1 సెం.మీ తదితర మండలాల్ల 1. 5 సెం.మీ, వర్షపాతం నమోదైంది.

వరదలో చిక్కుకున్న 8మంది

- ప్రవాహం తగ్గిందని దాటుతుండగా ఒకరి గల్లంతు.. కొనసాగుతున్న గాలింపు

పాల్వంచ రూరల్,సెప్టెంబర్ 4: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పరదిలోని కిన్నెరసాని, మొర్రేడువాగులు పొంగి ప్రవహించడంతో బుధవారం ఈ రెండువాగుల సంగమ ప్రాంతంలోని గడ్డపై 8మంది పశువుల కాపర్లు చిక్కుకుపోయారు. వారిలో ఒకరు వాగులో గల్లంతయ్యారు. మిగిలినవారిని రక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పాల్వంచ మండలంలోని దంతలబోరుకు చెందిన పశువుల కాపర్లు పశువులను తోలుకుని కిన్నెరసాని వాగు దాటి నడిగడ్డ వైపు వెళ్లారు. ఆ తర్వాత కిన్నెరసాని 8 గేట్లు ఎత్తి 53వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో మధ్యాహ్నం వరద ఉధృతి పెరిగింది. మరో వైపు మొర్రేడు ప్రవహిస్తుండటంతో పశువుల కాపర్లు తిరిగి దంతలబోరు గ్రామానికి వచ్చేందుకు అవకాశం లేకుండా పోయింది. పశువులు మేపేందుకు వెళ్లిన వారు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు దంతలబోరు సమీపంలోని కిన్నెరసాని వాగు వద్దకు వెళ్లారు. నడిగడ్డపై చిక్కుకున్న వారిలో కేశబోయిన ఈశ్వరయ్య, అటుగుల కేధరి, శ్రీను, మంచినీళ్ల శివ, నాతకల్యాణ్, కంజా భద్రం, జారె సాయి, ఇర్పా నగేష్‌లు ఉన్నారు. అయితే వారిలో జారె సాయి అనే వ్యక్తి వరద తగ్గిందని భావించి రాత్రి 9గంటల సమయంలో వాగు దాటేందుకు ప్రయత్నించగా వాగులో గల్లంతయాడు. దాంతో బాధిత కుటుంబ సభ్యులు తహసిల్దార్‌కు ఇతర అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అధికారులు స్పందించి కిన్నెరసాని ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి కిన్నెరసాని ప్రాజెక్టుల గేట్లను నిలిపి వేయాలని కోరారు. తరువాత అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సంఘటనా స్థలానికి చేరుకొని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడారు. ఎమ్మెల్యేతో పాటు భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



వాగులో చిక్కుకున్న వారి కోసం ఎదురుచూస్తున్న గ్రామస్థులు

మాజీమంత్రి కబ్జాలతోనే అపారనష్టం

- కాల్వలు కబ్జాకాకుంటే ఇంతనష్టం జరిగేది కాదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి/నేలకొండపల్లి/కారేపల్లి, సెప్టెంబరు 4: ఖమ్మం జిల్లాకు చెందిన మాజీమంత్రి కాల్వలను కబ్జా చేయడం వల్లనే ఖమ్మం జిల్లాకు పెనుముప్పు వాటిల్లిందని రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఖమ్మంజిల్లా కూసుమంచి మండలంలో ఇటీవల భారీ వర్షాలకు నష్టపోయిన బాధితులను బుధవారం మంత్రి పరామర్శించారు. ఇటీవల పాలేరు వరదలో మృతి చెందిన నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన షేక్ యాకుబ్, సైదాబీలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను వారి కుమారులు యూసుబ్, షరీఫ్‌కు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి మంత్రి అందజేశారు.

పాలేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాల్వలు సరిగా ఉండి ఉంటే ఎంతోకొంత తగ్గి ఉండేదన్నారు. కానీ మాజీమంత్రి కాల్వల కబ్జాచేయడం వల్ల వరద నీరు ప్రవహించే దారి లేకుండాపోయిందన్నారు. దాంతో పెనుముప్పు వాటిల్లిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌ను ఉద్దేశించి ఆరోపించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం పర్యటనలో పంటకాల్వల కబ్జా విసయాన్ని ప్రస్తావించారని, అయినా ఇక్కడకు వచ్చిన మాజీ మంత్రి హరీష్‌రావు కానీ సంబంధిత జిల్లామంత్రి కానీ దీనిపై స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కడుపుకాలిన వారు ఆవేదన వ్యక్తం చేస్తే దాడి చేశారనడం సరికాదన్నారు.ఇప్పటికైనా మాజీమంత్రి ప్రభుత్వ భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు.

ఆరుజిల్లాల్లో అపారనష్టం

భారీ వర్షాలకారణంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, సూర్యాపేట, మహబూబాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అపారనష్టం జరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు. సుమారు రూ.5,438 కోట్లు నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. వందేళ్లలో ఇలాంటి వరదలు రాలేదని తెలిపారు. వేలాది ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని, వేలాదిమంది నిరాశ్రయులయ్యారన్నారు. వరదలను కేంద్ర ప్రభుత్వం జాతీయవిపత్తుగా ప్రకటించి తక్షణ సాయంగా రూ.రెండువేల కోట్లు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర గిడ్డంగులసంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఆర్డీవో గణేష్, ఆర్‌అండ్‌బీఎస్‌ఈ హేమలత, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరావు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

తెలంగాణాలో భీభత్సం సృష్టించిన వరదలను జాతీయ విపత్తుగా కేంద్రం స్వీకరించాలని మంత్రి పొంగులేటి కోరారు. నేలకొండపల్లి మండలం కట్టుకాచరం, రామచంద్రాపురం, సుర్దేపల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం మంత్రి వరద ప్రభావి త ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వరదలతో నష్టపోయిన ఏపీకి కేంద్రం ఎలా సహాయం అందిస్తుందో అలాగే తెలంగాణకు సైతం అందించాలని పొంగులేటి కోరారు.

అశ్విని కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందజేత

కారేపల్లి మండలం గంగారం తండాలో ఇటీవల వరదలతో మృతిచెందిన మోతీలాల్, అశ్విని కుటుంబానికి బుధవారం మంత్రి పొంగులేటి రూ.5 ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ చెక్కును మోతీలాల్ భార్య నేజికి మంత్రి అందించారు. అలాగే ఇందిరమ్మ ఇంటినిర్మాణానికి సంబంధించిన పట్టా పేపర్లను వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి అందచేశారు.

అటు కన్నీళ్లు.. ఇటు ఓదార్పు..

(5వ పేజీ తరువాయి)

కొంతమంది బాధితులు మాత్రం పునరావాస కేంద్రాల్లోనే వసతి పొందుతన్నారు.

చేరుతున్న నిత్యావసరాలు

వరద బాధితుల ఇళ్లకు నిత్యావసరాలు అందిస్తున్నారు. తెలంగాణ చేనేత సహకార సంస్థ ద్వారా రగ్గులు, చీరలు, దోతులు, కండవలును కిట్‌గా ఏర్పాటుచేసి వరద బాధిత కుటుంబాలకు అందిస్తున్నారు. ఇంటింటి సర్వే బృందాలు వెళ్లి జరిగిన నష్టాన్నిఅంచనా వేస్తున్నాయి. గురువారం నుంచి వరదలో నష్టపోయిన ఇళ్లకు తక్షణసాయంగా బాధిత కుటుబాల ఖాతాల్లో రూ.10వేల నగదు అందించబోతున్నారు.

మంత్రుల భరోసా

వరద సహాయ కార్యక్రమాల్లో మంత్రులు అనుక్షణం పర్యవేక్షిస్తూ భరోసాగా ఉంటున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి జిల్లాలో వరద ప్రాంతాల్లోపర్యటించారు. వరదలు, సహాయ కార్యక్రమాలపై అనుభవం ఉన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ఖమ్మంలో మకాంవేసి సహాయ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. వరద బాధితులకు కావాల్సిన దుప్పట్లు, దుస్తులు నిత్యావసరాలు కిట్లు తయారుచేయించి పంపిస్తున్నారు. బాధితులకు నేనున్నానంటూ భరోసా ఇస్తున్నారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ తదితర జిల్లాలనుంచి వెయ్యిమంది వరకు పారిశుధ్య సిబ్బందిని రప్పించి యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయిస్తున్నారు. పంచాయతీ, మునిసిపల్‌శాఖల నుంచి వచ్చిన ఇతరజిల్లాల సిబ్బంది వెయ్యిమంది వరకు పారిశుధ్య కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.

మరోవైపు మంత్రి పొంగులేటి పాలేరు నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాం తాల్లో సహా య కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున చెక్కులు అం దిస్తున్నారు. పొంగులేటి ఫౌండేషన్ ద్వారా నిత్యావసరాలు అందిస్తున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి మధిరలో సహాయ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. మంత్రులు స్వయంగా దగ్గరరుండి పర్యవేక్షిస్తుండడంతో వరద ప్రాంతాలుకొంత కుదుటపడుతున్నాయి.

పారిశుధ్య కార్మికులు కూడా పగలు రాత్రి శ్రమించి వీధులను శుభ్రం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా అందించారు. స్వచ్ఛంద సేవాసంస్థలు భోజనాలతోపాటు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. కొన్నిచోట్ల దుస్తులు పంపిణీ చేస్తున్నారు. వరద ముంపులో గురైన షాపులను శుభ్రం చేసుకునివ్యాపారాలు ప్రాంభిస్తున్నారు.

సహాయం కోసం ఎదురుచూపులు

ప్రభుత్వం, అధికారయంత్రాంగం సహాయ కార్యక్రమాలు చేస్తునర్నా కొన్ని శివారు కాలనీలకు నిత్యావసరాలు, భోజనాలు అందడంలేదు. అక్కడ కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లోతట్టులోని పద్మావతినగర్, బొక్కలగడ్డ, మోతీనగర్, వెంకటేశ్వరగర్ పెద్దతండా, రాజీవ్‌గృహకల్ప, కరుణగిరి, జలగంనగర్, ధంసలాపురం తదితర ప్రాంతాల్లో బురద మేటలు వేయడంతో బాధితులు వెళ్లలేని పరిస్థితి. పునరావాస కేంద్రాల్లో అపరిశుభ్రత నెలకొంది. విద్యార్థుల సర్టిఫికెట్లు, గృహయజమానుల పట్టాపాసుపుస్తకాలు, రిజిస్ట్రేషన్ కాగితాలు, పలురకాల ధ్రువీకరణ పత్రాలు పోవడంతో అవి వస్తాయా రావా అన్న కలవరం ఉంది.

మున్నేటి వరద..

ముందెన్నడూ చూడలేదు..

- భారీ వరదలపై వృద్ధుల స్పందన..

ఖమ్మం సాంస్కృతికం, సెప్టెంబరు 4: వాళ్లంతా ఏడు పదుల వయసు పైబడిన వృద్ధులు. జీవితంలో అనేక ఘట్టాలతోపాటు ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఎదిగిన ఖమ్మంలో చోటు చేసుకున్న అనేక ఘటనలకు, సందర్భాలకు, సాక్షులుగా ఉన్న వారు. లోకల్ ఫండ్ ఆఫీసు నుంచి, బల్దియా సఫాయిగా, ఆపై కార్పొరేషన్‌గా అవతరించిన ఖమ్మంకు ప్రత్యక్ష సాక్షులు.. అంతేకాదు.. రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న మున్నేటి వరద బీభత్సానికీ సాక్షీభూతంగా నిలిచారు. వరద ఉధృతి, తలెత్తిన మహోగ్రరూపం, జరిగిన ఘోర నష్టం, బాధితుల కన్నీళ్ల కోణంలో వారిలోని గతం తాలూకు మధుర స్మృతులను చెరిపేసి కన్నీటి చిత్రాన్ని ముందు నిలిపింది.. వారిలో కొందరిని కదిలించగా వరద విపత్తుపై తమ అభిప్రాయాలను తెలియజేశారు..

అనేక దఫాలు వరదలు చూశా కానీ..

ఎస్‌కే మదార్ సాహెబ్, ప్రకాశ్‌నగర్



ఖమ్మంలో పుట్టి ఖమ్మంలో పెరిగా వర్షాకాలంలో కొన్ని దఫాలు మున్నేటికి వరద సంభవించటం సాధారణమే కానీ. రెండు రోజుల క్రితం వచ్చిన వరద తీర ప్రాంత వాసులనే కాదు నగరంలోని ఇతర ప్రాతాల వారినీ వణికించింది. నాలుగైదు పర్యాయాలు మున్నేటి వరదలను ప్రత్యక్షంగా చూశా.. కానీ ఇంత పెద్ద ఎత్తున వరదను చూడటం ఇదే మొదటి సారి. ఎక్కడో వంతెన వద్ద ఉండాల్సిన మున్నేరు జూబ్లిక్లబ్ వరకు పరుగెత్తుకు రావటం భయాన్ని గొలిపింది. బస్సులు, లారీలు, తదితర వాహనాల ట్రాఫిక్‌తో ఉండే నయాజజార్ చౌరస్తాలో పడవలు తిరుగుతాయని ఎవరూ ఊహించలేదు. మున్నేటి తీరం వెంబడి నివాసాలు ఏర్పరుచుకున్న బడుగు బలహీన వర్గాల ప్రజలకు కోలుకోలేని నష్టం చోటు చేసుకుంది. అంతేకాదు ఇతర ప్రాంతాల వారు సైతం భయంతో వణకాల్సి వచ్చింది... రాబోయేకాలంలో వరద మరింత పెరిగితే పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇంతటి ఘోర విపత్తుకు కారణం ఏమిటో దాన్ని అరికట్టటం ఎలానో ఆలోచించాలి. భవిష్యత్తులో పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలి.

ఏరా.. సముద్రమా..

సర్వయ్య, బొక్కలగడ్డ



ఇన్నిసార్లు వరదను చూసాను కానీ ఇంత పెద్ద వరదను నేను ఇంతవరకు ఎన్నడూ చూడలేదు.. నాకు డెబ్బయి ఏళ్లకు పైగా ఉన్నాయి. నాలుగైదు సార్లు వరద నష్టాన్ని చూశాను కానీ అతి పెద్ద వరదను చూడటం ఇదే మొదటి సారి.. వచ్చిన వరదను చూస్తుంటే మున్నేరు ఏరా లేక పోతే ఇది సముద్రమా అన్న అనుమానం కలిగింది.. ఎక్కడో ఉండాల్సిన ఏరు కిలో మీటరు దాటి పొంగింది.. ముప్పయి నాలుగు అడుగుల ఎత్తున పొంగటం వల్ల ఇంతటి ఘోరం సంభవించింది.. అధిక వర్షాల వల్ల ఇంతటి వరద వచ్చిందా లేక వాగును ఆనుకొని ఇళ్లు, నిర్మాణాలు ఏర్పాటు కావటం వల్ల వరదకు కారణం అయ్యిందో అర్థం కావటం లేదు. మళ్లీ ఇటువంటి వరదలు రాకుండా చర్యలు తీసుకోవాలి..

వామ్మో అదేం వాన... ఇదేం వరద..

మోదె ఆగమ్మ, కాల్వొడ్డు



ఖమ్మంలో ఈ కాల్వొడ్డు ప్రాంతంలో ఉండబట్టి ఇప్పటి అరవయ్యేళ్లు దాటింది.. కానీ ఇంతటి వాన నా జీవితంలో చూడలేదు. మున్నేరుకు ఏడెని మిది సార్లు వరద రావటం చూశా ను.. కానీ ఇప్పుడొచ్చిన వరద ఇంతకు ముందెన్నడూ రాలేదు.. వరసగా మూడు నాలుగు రోజులు వాన విడవకుండా ముసురు పట్టినప్పుడు అన్ని చోట్లా వాన ఉన్నప్పుడు మున్నేటికి వరద వస్తుంది.. గతంలో మున్నేటి వంతెన దాక రెండు సార్లు వచ్చింది.. వంతెన దాటి కొద్దిగా ముందుకు ఒకసారి వచ్చింది.. ఎక్కువసార్లు వంతెన దిగువ భగంలోనే ఆగిపోతుంది. కానీ ఈసారి ఎందుకో ఎప్పుడూ లేని విధంగా నయాబజార్ సెంటర్ దాటి క్లబ్బు ముందుకు పో యింది.. వరద గతంలో నెమ్మదిగా పెరిగేది.. అందువల్ల ఇళ్లల్లో సామాన్లు సర్దుకొని బయటకు పోయేందుకు వీలుం డేది కానీ ఈసారి ఒక్కసారిగా అమాంతం అంతకంతకూ పెరిగి పోయిది. ఇందువల్ల ఎవరికి వారు భయంతో ప్రా ణాలు దక్కితే సాలు అనుకొని ఇళ్లు వదిలి బయటకు పో యినం.. వరదను తలుసుకుంటేనే వంట్లో వణుకొస్తోంది..

ఇంత ఘోరం గతంలో ఎప్పుడూ లేదు..

బూరగాని రాములు, మోతీనగర్



మున్నేరు పొంగి వరద ఇంత ఘోరాన్ని సృష్టించటం గతంలో ఎన్నడూ జరగలేదు. గత నలభై ఏళ్లగా మేము మోతీనగర్‌లో ఇల్లు కట్టుకొని ఉంటున్నాం. మున్నేరు మా ఇంటికి దాదాపు అర కిలో మీటరు దాక ఉంటుంది.. వరద మా ఇళ్ల దాకా రాదులే అన్నదైర్యంతో పాటు ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేయలేని కారణంగా ఇక్కడే ఉంటున్నాం. ఇప్పటి వరకు మూడు నాలుగు సార్లు మున్నేరుకు పెద్ద వరదలు రావటం చూశా కానీ.. వరద ఏరు దాటి కొంత దూరంలోని వంతెన ప్రారంభం కాడ నిలిచి పోయేది..

ఒడ్డుకు దగ్గరగా ఉన్న ఇళ్లల్లోకి వరద వచ్చేది.. దాదాపు వంతెన లోతట్టులోని ఇళ్ల వరకే ప్రమాదం ఉండేది... ఈసారి మహా అయితే అక్కడి దాకే వచ్చి ఆగిపోతుందని ధీమా ఉన్నాం. కానీ వరద అతి వేగంగా పెరిగి మహోగ్రరూపం దాల్చింది. మంచికంటినగర్ దాటి జూబ్లిక్లబ్ వద్దకు వెళ్లింది... వరద ముప్పయి తొమ్మిది అడుగులు దాటటం వల్ల ఇంతటి నష్టం సంభవించింది. ఎక్కువ వర్షం కురవటం వల్ల ఈపరిస్థితి ఏర్పడిందా లేక ఇతర కారణం ఏదైనా ఉందా.. ఆలోచించాలి.. మరోసారి ఇలాంటి భయంకర పరిస్థితి తల్తెతకుండా కట్టుదిట్టం చేయాలి.

బాధిత కుటుంబానికి ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ

టేకులపల్లి, సెప్టెంబరు 4: కిన్నెరసాని వాగులో గల్లంతై మృతిచెందిన లచ్చగూడెం గ్రామానికి చెందిన కోరం వెంకటేశ్వర్లు, దొడ్డా సాయికుమార్ కుటుంబాలను బుధవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మండలంలోని లచ్చగూడెం సందర్శించి వారి కుటుంబాలను పరామర్శించారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా దేవానాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భూక్యా చంద్రకళ, మాజీ వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఇస్లావతు రెడ్యానాయక్, భద్రునాయక్, మూడు సంజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వ్యవస్థాపక నాయకుడు

కుతుంబాక బసవనారాయణ కన్నుమూత

- నేడు వీ వెంకటాయపాలెంలో అంత్యక్రియలు



బసవనారాయణ (ఫైల్)



ఎన్టీఆర్‌తో బసవనారాయణ (ఫైల్)

రఘునాథపాలెం, సెప్టెంబరు 4: టీడీపీ వ్యవస్థాపక నాయకుల్లో ఒకరైన కుతుంబాక బసవనారాయణ(90) అనారోగ్యంతో బుధవారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో మంచి సంబందాలు కలిగిఉన్న కుతుంబాక బసవనారాయణ టీడీపీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా ఖమ్మం అసెంబ్లీ నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలైనారు. ఖమ్మం కమ్మ మహాజన అధ్యక్షుడిగా, ఖమ్మం జిల్లా టీడీపీ తొలి అధ్యక్షుడిగా పనిచేశారు. శబరి సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేసి వ్యాపారంగంలో రాణించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొలి టీడీపీ జెండాను ఎన్టీఆర్ చేతుల మీదుగా వీ వెంకటాపాలెంలో ఆవిష్కరింపచేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తోను మంచి సన్నిహిత సంబందాలు కలిగి ఉన్నారు. కాగా కుతుంబాక భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామం రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలేనికి బుధవారం రాత్రి తరలించారు. గురువారం అంత్యక్రియలు జరిపేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు ప్రారంబించారు. బసవ నారాయణకు భార్య సరస్వతి, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు శ్రీనివాసరావు పంచాయతీరాజ్‌శాఖలో డీఈగా, మరో కుమారుడు శ్రీధర్ అమెరికాలో, చిన్న కుమారుడు శ్రీరాం ఖమ్మంలో దంత వైద్యులుగా పనిచేస్తున్నారు.

టీడీపీ నాయకుల సంతాపం

టీడీపీ జిల్లా నాయకులు డాక్టర్ రామనాధం, కూరపాటి వెంకటేశ్వర్లు, కేతినేని హరిష్‌రావు తదితరులు సంతాపం తెలిపారు.

వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం పట్టణంతో పాటు జిల్లాలో యుద్ధ ప్రాతిపదికన వరద సహాయక క్యాక్రమాలు చేపడుతున్నామన్నారు. వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ మొదలుపెట్టామని, ప్రభుత్వం అందించే ఆర్థికసాయం సర్వే ద్వారా ఆయా కుటుంబాల అకౌంట్లకే నేరుగా నగదు జమ చేస్తామని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం జిల్లా అధికారులతో కలిసి మంత్రి తుమ్మల విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఖమ్మం పట్టణంతో పాటు జిల్లాలో 7,400 ఇళ్లు ముంపునకు గురయ్యారని, ఇందులో ఖమ్మం నగరంలోనే 5వేల ఇళ్లు మునిగాయన్నారు. వరద బాధితులకు ప్రతి కుటుంబానికి 10 కేజీల బియ్యం, రగ్గులు, రెండు జతల చీరలు, నూనె ప్యాకెట్, కూరగాయలు, పప్పు,కారం నిత్యావసర వస్తువుల కిట్లను వరద బాధితులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం వరద తగ్గడంతో కాలనీల్లో ఇంటింటి సర్వే జరుగుతోందని, ఈ సర్వేలో కుటుంబ వివరాలతో పాటు వారి బ్యాంకు అకౌంట్లను తీసుకుని వారికి ప్రభుత్వం తరపున అందించే ఆర్థిక సాయాన్ని నేరుగా జమ చేస్తామన్నారు.

మున్నేరు వరదతో పేరుకుపోయిన చెత్త, బురదను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నామన్నారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచి వెయ్యి మంది శానిటేషన్ సిబ్బందిని తీసుకొచ్చి పారిశుధ్య పనులు చేయిస్తున్నామన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరాను 50జేసీబీలు, వంద ట్రాక్టర్లు శానిటేషన్‌లో పాల్గొంటున్నాయన్నారు. వంట చేసుకునే వీలులేని వారికి కార్పొరేషన్, స్వ చ్ఛంద సంస్థల ద్వారా భోజనాలు అందిస్తున్నామని తెలిపారు.

లోతట్టు కాలనీల్లో తేమ అధికంగా ఉన్న చోట విద్యుత్ షాక్ వచ్చే అవకాశం ఉన్నదున విద్యుత్ సరఫరా ఇవ్వడం లేదన్నారు. వరద వచ్చిన మూడురోజుల్లోనే ఖమ్మాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు 90శాతం సహాయం కార్యక్రమాలు పూర్తిచేశామన్నారు. అగ్నిమాపక సిబ్బంది ద్వారా రోడ్లు, ఇళ్లను శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు.

జిల్లా యంత్రాంగం అద్భుతంగా పనిచేస్తోందని, పోలీసులు స్వచ్ఛందంగా శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారని కలెక్టర్, సీపీ మునిసిపల్ అధికారులతో పాటు ఇతర అధికారులను మంత్రి అభినందించారు. స్వచ్ఛంద సంస్థల వారు కూడా భోజనాలు ఇతర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని ప్రశంశించారు. వరదలో కొట్టుకుపోయిన అస్తిపత్రాలు, ఆధార్‌కార్డులు, పాస్ పుస్తకాలు, విద్యార్థుల సర్టిఫికెట్లను ప్రభుత్వమే అందిస్తుందని, కలెక్టర్ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదులు తీసుకుంటారన్నారు.

గత వందేళ్ల చరిత్రలో మున్నేరు తొలిసారి 39 అడుగులు దాటి ప్రవహించడంతో అధికనష్టం జరిగిందన్నారు. మున్నేరు వరదతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆకేరుపై వరద పడడంతో ఈప్రాంతంలో వరద వచ్చిందని తుమ్మల వివరించారు. సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, పాల్గొన్నారు.

గిరిజన విద్యాసంస్థల్లో

గుణాత్మక విద్యకు కసరత్తు

- విద్యార్థుల్లో ప్రాథమిక జ్ఞానంపై ప్రత్యేక దృష్టి
- 23 అంశాల ప్రశ్నావళికి అనూహ్య స్పందన
- ఉత్తమ డాక్యుమెంటేషన్‌లకు నేడు పీవో చేతుల మీదుగా పురస్కారాలు



విద్యార్థినిచే బోధన చేయిస్తున్న పీవో (ఫైల్)

భద్రాచలం,సెప్టెంబరు 4: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యా సంస్థల్లో గుణాత్మక విద్యను పెంపొందించేందుకు ఐటీడీఏ పీవో బి.రాహుల్ కసరత్తు చేపట్టారు. ఇటీవల కాలంలో ఐటీడీఏ పరిధిలోని వివిధ ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో గిరిజన విద్యా సంస్థల్లో గుణాత్మక విద్యను పెంపొదించాలని పీవో భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో విద్యార్థులకు వారి పాఠ్యాంశాల్లో ప్రాథమిక జ్ఞానం ఏ మేరకు ఉంది అని గుర్తించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, గిరిజన ప్రభుత్వ పాఠశాలలు(జీపీ స్కూల్స్) సర్వతోముఖాభివృద్ధికి తీసుకోవాల్సి ప్రణాళికలను అంశాల వారీగా డాక్యుమెంటేషన్ రూపంలో నివేదికలను మంగళవారం భద్రాచలం ఐటీడీ ఏ కార్యాలయంలో సీల్డు కవర్లో అందజేశారు.

23 అంశాలతో ఉపాధ్యాయులకు ప్రశ్నావళికి అనూహ్య స్పందన

గిరిజన విద్యా సంస్థల్లో గుణాత్మకమైన విద్యనందించాలనే సంకల్పంతో 23 అంశాలతో ఉపాధ్యాయులకు ప్రశ్నావళిని రూపొందించి వారి నుంచి వివరాలను సేకరించే ప్రక్రియకు ఉపాధ్యాయుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. అధికారులు ఊహించిన దానికంటే రెండున్నర రెట్లు అధికంగా డాక్యుమెంటేషన్‌లందడం గమనించదగ్గ విషయం. వీటిని ఇప్పటికే ఐటీడీఏ పీవో ఇప్పటికే పరిశీలించి ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చే శారు. గురువారం ఉత్తమ డాక్యుమెంటేషన్‌లను పంపిన వారికి పీవో బి.రాహుల్ నగదు పారితోషక పురస్కారాలను అందజేయనున్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలతో విస్తుపోయే వాస్తవాలు


భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ పీవోగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్య, వైద్యరంగాలపై విశేష దృష్టి సారించారు. ముఖ్యంగా విద్య, వైద్యంతోనే గిరిజనాభివృద్ధి సాధ్యమనే భావనతో ఆయన ఉన్నారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమాలు, గురుకులాలు, వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. కొన్ని విద్యా సంస్థల్లో విద్యార్థులతోనే పాఠ్యాంశాల బోధన విద్యార్థులకు చేయించారు. పీవో పర్యటనలో విస్తుపోయే వాస్తవాలు ఆయన దృష్టికి వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అధికశాతం విద్యార్థులు కనీసం సాధారణ స్థాయిలో కూడా ఆంగ్లం, లెక్కల్లో ప్రాథమిక పరిజ్ఞానం లోపించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో 23 అంశాలతో ఇచ్చిన ప్రశ్నావళికి అనూహ్య స్పందన రావడం అందులో పలువురు ఉపాధ్యాయులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించినట్లు తెలుస్తోంది. గిరిజన విద్యా సంస్థల్లోని విద్యార్థులు తమ గురించి తాము కనీసం పది వ్యాఖ్యాలు చెప్పలేని స్థితిలో ఉండటంతో విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు పీవో పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

తేరుకునేలోపే వరద చుట్టుముట్టింది..

- చంటిబిడ్డలను సంకనేసుకుని పరుగులు పెట్టాం
- వరద బాధితుల ప్రత్యక్ష అనుభవాలు

ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 4: అప్పుడప్పుడే తెల్లారుతోంది. కూలి పనులకు పోయే జీవులు కాబట్టి రోజువారీలాగానే ఇళ్లల్లోని పెద్దవారు తెల్లవారుజామున లేచి ఇంటి పనులు చేసుకుంటున్నారు. ఒకవైపు వర్షపు జల్లులు పడుతుండగానే... పైనుంచి వచ్చిన వరద ఇళ్లను చుట్టుముట్టింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు లోపలికి వెళ్లి బయటకు వచ్చేలోపు మున్నేరు ఇళ్లను ముంచేసింది. ఒక్కసారిగా నీళ్ల ఇళ్లలోకి రావడంతో తెల్లబోయి చూడాల్సిన పరిస్థితి వారిది. నీళ్ల ఎక్కడినుంచి వస్తున్నాయా అని ఆలోచించి తేరుకునేలోపే చుట్టూ నీళ్ల కమ్ముకున్నాయి. వెంటనే ఇళ్లలోపలికి పరుగులు పెట్టి మిగిలిన వారిని నిద్రలేపి కట్టుబట్టలతో ఒడ్డుకు చేరుకున్న దయనీయ స్థితిలో మున్నేరు ముంపు నుంచి బయటపడిన బాధితులు వారి మనోగతాన్ని బుధవారం ముంపు ప్రాంతాలకు వెళ్లిన 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

చంటిబిడ్డను చంకనేసుకుని రోడ్డెక్కాం: కె. మధు



నలభైయేళ్లుగా మా తాతలు, తండ్రుల కాలం నుంచి యేటి ఒడ్డున ఉన్న ఆర్‌టీ స్థలంలోనే నా భార్య మహాలక్ష్మీతో కలిసి జీవనం సాగిస్తున్నా. సెంట్రింగ్ పనులు చేసుకుని వచ్చిన కూలీ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటాం. కొద్దికాలం క్రితమే మాకు ఓ పాప పుట్టింది. రోజూవారీ పనుల్లో భాగంగా ఉదయాన్నే లేవాల్సి ఉంటుంది. మా ఆవిడ ముందుగా లేచి నాకు అన్నం, వండి క్యారేజీ కడుతుంది. అలాగే ఆదివారం తెల్లవారు జామున కూడా లేచింది. సుమారు నాలుగున్నర గంటల సమయం ఒక్కసారిగా పరుగులు పెడుతూ లోపలికి వచ్చింది. కంగారుపడుతూ నిద్రలేపి నీళ్ల వస్తున్నా యంటూ గట్టిగా కేక వేసింది. దిగ్గున లేచి కూర్చుని తేరుకునేలోపు గుడిసెలోకి వరదనీళ్ల రావడం మొదల య్యాయి. వెంటనే చంటిబిడ్డను సంకనేసుకుని ఇంట్లోనుం చి బయటకు వచ్చేసరికి మోకాళ్లలోతుకు నీరు వచ్చి చేరింది. మా ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు దారి లేదు. మేము ఎప్పటినుంచో ఎగువన ఉన్న నాయుడుపేట రోడ్డుపైకి ఎక్కి దిగుతూ ఉంటాం. చీకట్లో ఏమీ కనిపించకపోయినా ఆ రోజు కూడా వరద భయంతో కాళ్లు జారుతున్నప్పటికీ పైకి ఎక్కి చూసేసరికి మా ఇళ్లు సగానికి పైగా మునిగిపోయాయి. వరద తగ్గిన తర్వాత వచ్చి చూసుకుంటే ఇంట్లో ఏ వస్తువు లేకుండా పోయింది. రెండ్రోజులుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫంక్షన్ హాలులో తలదాచుకుంటున్నాం.

డాక్యుమెంట్లు సర్దుకునే సమయం కూడా లేదు

బి. విజయకుమారి



నాకు పెళ్లయి పదహారేళ్లు అవుతోంది. అప్పటినుంచి బొక్కలగడ్డలో ఉన్న మా అత్తగారింట్లోనే ఉంటున్నాం. ప్రభుత్వ ఆసుపత్రిలో సెంట్రల్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ పద్ధతిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నా. సమయం కూడా ఇవ్వకుండా వరద వస్తుందని ఊహించలేదు. ఎప్పుడైనా వరదలు వచ్చినప్పుడు మా ప్రాంతానికి కూడా మున్నేరు వరద రావడం సర్వసాధారణమే. శనివారం కూడా భారీ వర్షాలు ఉన్నాయనీ చెప్పినప్పటికీ మా ఇంటి వరకు వస్తుందని అనుకోలేదు. రోజులాగానే రాత్రి సమయంలో భోజనం చేసి కుటుంబసభ్యులతో కలిసి నిద్రపోయాం. తెల్లవారుజామున ఐదుగంటల సమయంలో చుట్టుపక్కల అందరూ కేకలు వేసుకుంటూ పరుగులు పెడుతున్నారు. మేలుకు వచ్చే చూసేసరికి రోడ్లమీదకు వరద వచ్చింది. ఇంట్లో ఉన్న కొద్దిపాటి నగదు, బంగారం వంటివి తీసుకునేలోపు వరద చుట్టుముట్టింది. సర్టిఫికెట్లను తీసుకుని బయటకు వెళ్దామనుకునేలోపు వరద పెరుగుతూ వచ్చింది. అవి తీసుకోకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాం. వరద తగ్గిన అనంతరం ఇంటికి వచ్చి చూసుకునే సరికి ఇల్లాంతా బురదతో నిండిపోయింది. ఇంట్లో ఏయే వస్తువులు ఉన్నాయో వెతుక్కోవడానికి రెండురోజుల సమయం పట్టింది. శుభ్రం చేసుకునేందుకు ఇంటిల్లపాది కష్టపడుతున్నా ఇంకా రెండు మూడు రోజులు సమయం పట్టేలా ఉంది. వరదల్లో నాకు సంబంధించిన ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు ఉన్న సర్టిఫికేట్లు కొట్టుకుపోయాయి. కలెక్టర్, ఎస్పీ వరద ముంపు ప్రాంతాల్లోని ఇళ్లను పరిశీలించేందుకు వచ్చిన సందర్భంలో సర్టిఫికేట్ల గురించి చెప్పగా అవి ఇస్తామని చెప్పారు.

ముందురోజు రాత్రి మొత్తం నిద్రనే పోలేదు..

భూక్యా నాగమణి



మేము ఉండేది యేటి ఒడ్డునే. నా కొడుకు, కోడలు హైదరాబాద్‌లో నివాసం ఉంటారు. నేను ఇక్కడే కూలి పనులకు వెళ్తూ నా మనువడితో కలిసి చిన్నపాటి ఇంట్లో ఉంటాం. గతంలోనూ వర్షం వచ్చినప్పుడు మా ఇల్లు మునిగిపో యింది కానీ ఇంత పెద్దమొత్తంలో వరద వస్తుందని అనుకోలేదు. శనివారం రోజునే వర్షాలు పడతా యనీ, ఇల్లు ఖాళీ చేసి వెళ్లాలని చుట్టుపక్కల స్థానికులతో చర్చించుకున్నాం. ఆ రోజు రాత్రి మొత్తం ఎప్పుడు వరద వస్తుందోనంటూ భయపడి నిద్రనేపోలేదు. అలాగే యేటి వైపు చూస్తు ఉండిపోయా. కానీ వరద పెరిగే విధానాన్ని అంచనా వేయలేకపోయా. ఒక్కసారిగా వరద వెనుక నుంచి పెరుగుతూ వచ్చి ఇంట్లోకి నీళ్ల వచ్చాయి. ఉరుకు లు పరుగులతో నిద్రపోతున్న నా మనువడిని లేపి బయటకు తీసుకెళ్తుండగానే నడుముల్లోతు నీళ్లొచ్చాయి. అక్కడి నుంచి చుట్టుపక్కల స్థానికులు అందరితో కలిసి బయటకు వెళ్లిపోయా.. వరద తగ్గిన తర్వాత వచ్చి చూస్తే ఇల్లు రూపమే మారిపోయింది. పైకప్పు పోయి, తలుపులు, దర్వాజలతో సహా ఇంట్లోని వస్తువులన్నీ కొట్టుకుపోయాయి. ప్రభుత్వం వారు వచ్చి లెక్కలు రాసుకుని పోయారు.

సీతారామ కాలువకు గండి పడలేదు

- మేమే గండి పెట్టాం: సీటి పారుదల శాఖ అధికారులు

చంద్రుగొండ, సెప్టెంబరు 4: సీతారామ కాలువకు మద్దుకూరు గ్రామ సమీపంలో గండి పడినట్టు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆ గండి నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలోనే పెట్టినట్టు ఆ శాఖ ఏఈ కార్తీక్ తెలిపారు. ఈ ఘటనపై ఏఈ బుధవారం వివరణ ఇస్తూ వర్షాల వల్ల కాలువలోకి భారీగా వరద నీరు చేరిందని, దీనివల్ల పలు చోట్ల కాలువకు గండ్లు పడే ప్రమాదం ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరద నీరు బయటకు పోవటానికి గండి ఏర్పాటు చేశామన్నారు. సీతారామ కాలువపై పలు చోట్ల వంతెనలు నిర్మాణం జరుగుతున్నాయని, ఆప్రదేశంలో కాలువకు అడంగా రోడ్లు ఉన్న కారణంగా కాలువలో నీటి ప్రవహం జరగటం లేదన్నారు. ఈ కారణంతోనే కాలువ నిండుకుంలా మారి గండ్లు పడే ప్రమాదం ఉండటంతో 79 కిలో మీటర్ వద్ద వాగుపై నిర్మించిన అండర్ టెన్నల్ (యూటీ)పై గండి ఏర్పాటు చేసి వరద నీటిని వాగులోకి వదిలి నట్లు తెలిపారు. కాగా కాలువ గండి వల్ల పంటనష్టం జరిగిందని కొందరు రైతులు ఫిర్యాదు చేయటంతో మండల వ్యవసాయ శాఖ అధికారి వినయ్ ముంపునకు గురైయిన పంట చేలను పరిశీలించారు. నలుగురు రైతులకు చెందిన ఐదు ఎకరాల్లోని వరి, పత్తి పంటకు నష్టం జరిగిందని ఏవో విలేకరులకు తెలిపారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 4: విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్యుతాపురం గ్రామానికి చెందిన పసుపులేటి చినపోలయ్య(58) తాపీ పనులు చేస్తుంటాడు. తన ఇంటి నిర్మాణంలో భాగంగా మంగళవారం సెంట్రింగ్ పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని ఖమ్మం తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం రూరల్, సెప్టెంబరు4: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం ఆర్టీసీ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం అర్బన్ మండలం యూపీహెచ్ కాలనీకి చెందిన పోలోరు సత్యనారాయణ (55) ఆర్టీసీ కాలనీలోని పుల్లయ్య ఇంటికి మోటర్ మరమ్మత్తు నిమిత్తం వెళ్లాడు. మోటార్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు వెంటనే అతడిని ఖమ్మం తరలించగా, అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యం వికటించి బాలుడు...



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పాల్వంచ, సెప్టెంబరు4: వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన ఘటన పాల్వంచలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శేఖరంబంజరానికి చెందిన రమేష్ కుమారుడు గుగులోతు జిన్ను (4) గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు మొదటి రోజే స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. మరుసటి రోజు జ్వరం తగ్గకపోగా ఇంజక్షన్ చేసిన చోట వాచి, నల్లగా కమిలిపోయి, గడ్డగా మారి ఇన్‌ఫెక్షన్ సోకింది. దీంతో మరోసారి అదే వైద్యుడి వద్దకు వెళ్లి అడుగగా, బాలుడి పరిస్థితి విషమంగా మారిందని, ఖర్చులు తాను భరిస్తానని, వెంటనే పెద్దాసుపత్రికి తీసుకెళ్లమని బాలుడి తండ్రికి చెప్పాడు. దీంతో అతడు హుటాహుటిన బాలుడిని తీసుకుని హైదరాబాద్ వెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తిరిగి పాల్వంచకు చేరిన తల్లిదండ్రులు, బంధువులు న్యాయం చేయాలని సదరు ఆర్ఎంపీ వైద్యుడి ఇంటిముందు భైటాయించారు. స్థానికులు ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో ఈ వ్యవహారం కాస్తా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి ..

ఖమ్మం రూరల్, సెప్టెంబరు4: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాలేష్ (30) అనే వ్యక్తి కొంతమందితో కలిసి గత నాలుగేండ్లుగా తల్లంపాడు ప్రాంతంలో రంగుల పని పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి తల్లంపాడు ప్రాంతంలోని కాలువలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందాడు. అతడి మృతదేహన్ని పోలీసులు నీటిలో గాలించి బుధవారం వెలికి తీశారు. మృతుడి సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరదకు రెండు దుక్కిటెద్దులు..



నీటమునిగి మృత్యువాత పడిన పశువులు

ఆళ్లపల్లి, సెప్టెంబరు4: వరద నీటిలో మునిగి రెండు ఎద్దులు మృతి చెందిన సంఘటన మండలంలోని రాఘవపురం పంచాయతీ సీతానగర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగర్ గ్రామానికి చెందిన పూణేం లక్ష్మయ్య అనే రైతు బండారుగూడెం సమీపంలోని వొర్రె వద్ద తన పొలంలో రెండు దుక్కిటెద్దులను(ఆవు, ఎద్దు)లను కట్టేస్తాడు. కాగా బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురవడంతో మలుపు వొర్రె వరద పైకి ప్రవహించడంతో దుక్కిటెద్దులు కట్టేసిన ఒడ్డు కూలి వరదలో మునిగి మృత్యువాతపడ్డాయి. మృతి చెందిన పశువుల విలువ సుమారు రూ.70 వేలవరకు ఉంటుందని రైతు తెలిపాడు. రెవెన్యూ, పశుశాఖ అధికారులు మృతి చెందిన పశువులకు పంచనామా నిర్వహించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

భద్రాచలం, సెప్టెంబరు 4: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు మృతి చెందిన సంఘటన భద్రాచలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..భద్రాచలంలోని రాజవీధికి చెందిన వెంకటేష్(28) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ విజయలక్ష్మి మృతదేహన్ని పోస్టుమార్టానికి తరలించి, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

పాల్వంచ, సెప్టెంబరు 4: గట్టు పంచాయతీ ఎంతకూ ఓ కొలిక్కి రాకపోవడంతో ఆగ్రహించిన ఓ వ్యక్తి వేట కొడవలితో ప్రత్యర్థిపై దాడి చేసిన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన చింతకుంట వెంకటరెడ్డికి పామాయిల్ తోట ఉంది. అదే తోటకు కాడికట్టు రైతు మల్లేడు వెంకన్నకు, వెంకటరెడ్డికి గతంలోనే గట్టు పంచాయతీ నడుస్తుంది. పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీ పెట్టినా, వారిద్దరి మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో బుధవారం ఉదయం వెంకటరెడ్డి తన పామాయిల్ తోటలో ఉండగా, వెంకన్న అందులోకి ప్రవేశించి వేట కొడవలితో అతడిని చంపడానికి ప్రయత్నించాడు. కాగా అదే సమయంలో వెంకటరెడ్డి కుమారులు అక్కడకు చేరుకోవడంతో వెంకన్న అక్కడ నుంచి పరారయ్యాడు. వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు వెంకన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

19 ద్విచక్ర వాహనాల పట్టివేత

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు4: సరైన ధ్రువపత్రాలు లేకుండా కొనుగోలు చేసిన వాహనాలను హైదరాబాద్‌కు చెందిన క్రైమ్ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్న సంఘటన బుధవారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి చోరీ చేసిన వాహనాలను, ఇక్కడికి తీసుకొని వచ్చి సత్తుపల్లి, సరిహద్దులోని ఇతర జిల్లాల్లోకి అమాయకులకు తక్కువ ధరకు విక్రయించినట్లు తమ విచారణలో తేలడంతో అక్కడి పోలీసులు సత్తుపల్లి చేరుకున్నారు. ఈ క్రమంలో సుమారు 20ద్విచక్ర వాహనాలను పట్టుకుని సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం హైదరాబాద్‌లోని బేగంపేటకు తరలించి బాధితులకు అప్పగించనున్నట్లు తెలిసింది. ఇట్టి వాహనాలను చోరీ చేసిన ఒక యువకుడిని పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇంకా ఈ వాహనాల చోరీలో ఎంతమంది హస్తం ఉంది, ఇంకా ఎవరెవరి వద్ద సరైన పత్రాలు లేని వాహనాలు ఉన్నాయనే కోణంలో పోలీసుల విచారణ సాగుతుంది. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను క్రయవిక్రయాలు జరపడం నేరమని పోలీసులు చెబుతున్నారు.

మోసం చేసిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

ఖమ్మం లీగల్ సెప్టెంబరు4: మోసం చేసిన కేసులో ఖమ్మం పట్టణానికి చెందిన సంఘబత్తుల శ్రీనివాసరెడ్డికి రెండేళ్ల జైలు శిక్షతోపాటు మూడు వేల రూపాయల జరిమానాన్ని విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందు ప్రియా బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాల ప్రకారం.. నిందితుడైన శ్రీనివాసరెడ్డి వద్ద 2005 మే 2న సర్వే నెంబర్ 342బైఅ లో ఫిర్యాదుదారుడు ఖమ్మం రఘునాథపాలెం మండలం కోయచలక గ్రామానికి చెందిన చెరుకూరి రామయ్య స్థలాన్ని కొనుగోలు చేశాడు. కాగా అట్టి స్థలాన్ని వేరే వారికి ఇంతకు ముందే రిజిస్ట్రేషన్ చేశాడని, ఆ స్థలాన్ని మరలా ఫిర్యాదికి రిజిస్ట్రేషన్ చేశాడని రామయ్య కోర్టులో ప్రైవేట్ కేసును దాఖలు చేశాడు. పోలీసులు అట్టి కేసును విచారించి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయధికారి నేరం రుజువు కావడంతో శ్రీనివాసరెడ్డికి రెండేళ్ల జైలుతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

కూలిన రైతు వేదిక సీలింగ్



లక్ష్మీదేవిపల్లిలో రైతు వేదికలో కూలిన సీలింగ్

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు4: మండల పరిధిలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న రైతు వేదికలో ఏర్పాటు చేసిన సీలింగ్ పీవోపీ మొత్తం బుధవారం కుప్ప కూలింది... ఈ సమయంలో రైతు వేదికలో సిబ్బంది ఎవరూ లేకపోవడం.. ఎటువంటి కార్యక్రమాలు జరగకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారులు పర్యవేక్షించి ఈ సంఘటన గల కారణాలను వెల్లడించాల్సి ఉంది.

అన్నదాత వెన్ను విరిచిన అకాలవర్షాలు

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 70 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- పత్తి, మిర్చి, వరి పంటలకు అధిక నష్టం
- వేలాదిరూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతుల్లో ఆందోళన

ఖమ్మం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ ఏడాది వానాకాలం పంటల సాగు సానుకూలంగా ఉందని భావించిన అన్నదాతలకు అకాలవర్షం మున్నేరు, ఆకేరు వైరా యేర్ల నుంచి వచ్చిన వరద రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 70 వేల ఎకరాల్లో పంటలు నష్టపోయిన ట్టు ప్రాథమిక అంచనా. ఇందులో ఎక్కువభాగం వరి, పత్తి, మిర్చి పంటలే ఉన్నాయి. నష్టపోయిన వాటిలో ఖమ్మం జిల్లాలోనే 68వేల ఎకరాల్లో పంటలుండగా 2వేల ఎకరాలపైగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లలో ఉన్నాయి. జిల్లాలో రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, ఖమ్మంఅర్బన్, ఖమ్మంరూరల్, చింతకాని, కూసుమంచి, మధిర ఎర్రుపాలెం, వైరా, కొణిజర్ల, కారేపల్లి, కామేపలిల మండలాల్లోని అధిక నష్టం జరిగింది.

అయితే పంటల నష్టంపై ఉమ్మడిజిల్లాలో వ్యవసాయాధికారులు పూర్తిస్థాయి సర్వే సాగిస్తున్నారు. ప్రాథమిక అంచనాల్లో సుమారు 30వేల ఎకరాల్లో పత్తి, 30వేల ఎకరాలు వరి, మిర్చి సుమారు 5వేల ఎకరాలు, నష్టపోగా మిగిలినవి ఇతర పంటలున్నాయి. ప్రస్తుతం పత్తి పంటలో ఈఏడాది అదనుగా వర్షాలు పడడంతో ఉమ్మడి జిల్లాలో ఏపుగా పెరుగుతున్నాయి. 3 లక్షల ఎకరాలపైగా పత్తి పంట వేశారు. వర్షాల కారణగా కొన్నిచోట్ల నీరు నిల్వ ఉండాగా దెబ్బతింటున్నాయి. పైపాట్లు, ఎరువులు వేసి పెరుగుతున్న తరుణంలో అకాలవర్షం, మున్నేరువరద రైతులను దారుణంగా దెబ్బతీసింది. తెల్లబంగారం సాగుద్వారా ఈఏడాది కష్టాలు గట్టెక్కుతాయని ఆశించిన రైతులు వరద నష్టంతో కన్నీటిపర్యంతం అవుతున్నారు. ఎకరానికి సుమారు రూ.10వేల కౌలు, మరోరూ.10వేలు విత్తనాలు, దుక్కులు, ఎరువులు పురుగులమందులకు ఎకరానికి రూ.20వేలు పెట్టడం జరిగింది. ఈతరునంలో పత్తి పంట కోల్పోవడం రైతులను కుంగదీస్తుంది. తెల్లబంగారం సాగుతో ఆర్థికంగా గట్టెక్కుదామని ఆశించిన రైతులు వర్షాలు దారుణంగా దెబ్బతీశాయి.



మేడేపల్లిలో నష్టం వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

వరి రైతులకు అదే పరిస్థితి...

ఉమ్మడి జిల్లాలో కురిసిన వర్షాలు చెరువులు, ప్రాజెక్టుల కింద వరినాట్లు వేశారు. జిల్లాలో ఎడమకాలవ కింద నీరు వదలడంతో వరినాట్లు ముమ్మరంగా పడ్డాయి. ప్రస్తుతం ఎరువులు వేసి పచ్చగా వరిపెరుగుతున్న తరుణంలో పంటల నష్టం అధికంగా చేసింది ఉమ్మడి జిల్లాలో సుమారు 25వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. కొన్నిచోట్ల ఇసుకమేటలు వేసి కొట్టుకుపోగా మరికొన్ని చోట్ల ఇంకా వరదలోనే వరి పొలాలున్నాయి.

వరద తగ్గితేకొన్ని పొలాలు తిరిగి కోలుకునే అవకాశం ఉండగా ఇసుకమేటలు వేసినపొలలాలు మాత్రం పూర్తిగా దెబ్బతినే పరిస్థితి కనిపిస్తుంది. దుక్కులు, వరినాట్లు, ఇతర ఖర్చులు కౌలుకలిపి రైతులు ఎకరానికి రూ.15 వేలపైగా ఖర్చుపెట్టారు. ప్రస్తుతం కురిసిన వర్షాలు, పొంగిన వరదలు వరి రైతులను తీవ్రంగా కలవర పరుస్తున్నాయి.



రాయపట్నంలో మునిగిపోయిన వరిపొలం

మిర్చి తదితర పంటలు..

ఉమ్మడి జిల్లాలో సుమారు 5వేల ఎకరాల వరకు మిర్చ పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా. మిర్చి నారు వేలాదిరూపాయలు ఖర్చుపెట్టి కొనుగోలు చేశారు. నారు,కౌలుకు ఎకరానికి రూ.25వేల నుంచి 50వేలు ఖర్చుపెట్టారు. మిర్చితోటలు వేస్తున్న తరుణంలోనే వర్షాలు, వరదలు రావడంఓ మున్నేరు పరీవాహకంతోపాటు ఇతర మండలాల్లోనూ పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి జిల్లాలో మిర్చి తోటలు వేసిన రైతులకు వరదలు వర్షాలు రావడంతో వరద పట్టని పొలాలు కూడా ఎర్రబడుతున్నాయి. ఎర్రబంగారంగా సాగుచేస్తున్న రైతులకు వర్షాలు, వరదలు తీవ్ర నష్టం కలిగించాయి. పెసర, ఇతర కూరగాయల తోటలు మొక్కజొన్న, చేలుకూడా దారుణంగా దెబ్బతిన్నాయి.

ప్రతి ఇంటిని వైద్య సిబ్బంది సందర్శించాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్

తల్లాడ, సెప్టెంబరు 4: ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా వ్యాధులు వృద్ధి చెందే అవకాశమున్న నేపథ్యంలో ప్రతి ఇంటిని వైద్యఆరోగ్య సిబ్బంది సందర్శించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్ ఆదేశించారు. బుధవారం తల్లాడలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రక్తపరీక్ష, మందుల గదులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి తరచూ ఫీవర్ సర్వే నిర్వహించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు జరుగుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు మండలంలో ఎన్ని డెంగ్యూ, క్షయ, లెప్రసీ కేసులు నమోదయాయ్యో మండల వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వి.సుబ్బారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం. వైద్యాధికారి ఐ.రత్నమనోహర్, సూపర్‌వైజర్లు డాక్టర్ కె.పెద్దపుల్లయ్య, భద్రమ్మ, స్టాఫ్‌నర్సులు కళావతి, రాజేశ్వరి, సురేష్, సంజూ, ల్యాబ్ టెక్నీషియన్లు రాజ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్

ముంపు ప్రాంతాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలి

- రాష్ట్ర మునిసిపల్ పరిపాలన అధికారి వీపీ గౌతమ్

మధిరటౌన్, సెప్టెంబరు4: వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలని సీడీఎంఏ గౌతమ్ మునిసిపల్ అధికారులకు సూచించారు. బుధవారం మధిరలోని మునిసిపల్ కార్యాలయంలో వరదలపై సమీక్ష నిర్వహించారు. వరదల సమయంలో మునిసిపాలిటీ తీసుకున్న చర్యలను ఛైర్‌పర్సన్‌ను, కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. వరద తగ్గడంతో ప్రజలు పునరావాస శిబిరాల నుంచి ఇళ్లకు వెళ్లారని, ముంపు ప్రాంతంలో బురద తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్‌డీఎంఏ సాహిద్ మసూద్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ మొండితోక లత, వైస్ ఛైర్‌పర్సన్ విద్యాలత, కమిషనర్ షఫీఉల్లా, మేనేజర్ ఉదయ్, టీపీఓ శ్రీనివాస్, ఎఈ నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, సెప్టెంబరు4: వర్షాలతో నష్టపోయిన అన్నివర్గాల వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర మునిసిపల్ పరిపాలన అధికారి వీపీ గౌతమ్ తెలిపారు. బుధవారం మండలంలోని రాకాసితండాలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా బాధితులతో మాట్లాడారు. గ్రామాల్లో సహాయక చర్యలను చేపట్టాలని సూచించారు. విద్యుత్‌తో పాటు తాగునీటి పునరుద్ధరణ పనులను చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు జేసీ చంద్రమోహన రాకాసితండా, జల్లేపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈకార్యక్రమంలో తహసల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, ఏపీఎం అలివేలుమంగ పాల్గొన్నారు..



బాధితులతో మాట్లాడుతున్న వీపీ గౌతమ్

వరద బాధితులకు మిత్ర ఫౌండేషన్ రూ.10లక్షల విరాళం

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబరు4: నగరంలోని మిత్ర ఫౌండేషన్ ఛైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్ వరద బాధితులకు రూ.10 లక్షల విలువ గల నిత్యావసర వస్తువులు అందజేయుటకు ముందుకు వచ్చారు. ఖమ్మం మునిసిపల్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన 10 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. మిత్ర ఫౌండేషన్, మిత్ర మిత్ర బృందం అనేక సంవత్సరాలుగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలకు సహాయం అందిస్తోంది. గతంలో భద్రాచలం వరద బాధితుల సహాయర్థం రూ.11 లక్షల విరాళాన్ని అందజేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి, ఇంకా ఎక్కువ మంది బాధితులను ఆదుకునేందుకు మిత్ర ఫౌండేషన్ కట్టుబడి ఉందని ఛైర్మన్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మిత్ర ఫౌండేషన్ సభ్యులు చారుగుండ్ల రవి కుమార్, పాలవరపు శ్రీనివాస్, చెరుకూరి యుగేందర్, మహంకాళి నగేష్, రంగా శ్రీనివాసరావు, మైలవరపు సతీష్, ఆత్మకూరి రామారావు, గోళ్ల అవినాష్, కార్పొరేటర్ మాటేటి నాగేశ్వరరావు, చొక్కవరపు నవీన్ కుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు చెక్కు అందజేస్తున్న ప్రవీణ్

బాధిత కుటుంబాలకు మంత్రి తుమ్మల పరామర్శ



పాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 4: వర్షంలోను నేను మీకు అండగా ఉంటానంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. మామిళ్లగూడెం కాల్వొడ్డు, సారథినగర్, 48వ డివిజన్‌లో మంత్రి తుమ్మల పర్యటించారు. అధికారులు చేపట్టిన సర్వేలపై ఆరా తీశారు. బాధితులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాల ప్యాకెట్లు, నిత్యవసరాలను బాధిత కుటుంబాలకు మంత్రి అందించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు, వీ వెంకటాయపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి సైదబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుడికి గుండెపోటు

- సీపీఆర్ చేసి కాపాడిన పోలీస్ అధికారి



గుండెపోటు వచ్చిన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న రమేష్

ఖమ్మం క్రైం, సెప్టెంబరు 4: వరద బాధితుడికి గుండెపోటు రావడంతో అక్కడే సహాయక చర్యలలో ఉన్న ఓ పోలీస్ అధికారి సీపీఆర్ చేసి అతడి ప్రాణాలు కాపాడిన సంఘటన బుధవారం ఉదయం ఖమ్మం నగరశివారులో జరిగింది. నగర శివారులోని ధంసలాపురం కాలనీకి చెందిన శ్యామల్‌రాజు అనే వ్యక్తి మున్నేరు వరదలతో బురదమయమైన తన ఇంటిని బుధవారం శుభ్రం చేసుకుంటుండగా అతడికి ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. దీంతో భార్య కేకలు వేస్తూ బయటకు వచ్చింది. ఈ సమయంలో అక్కడే వరద సహాయక చర్యల్లో ఉన్న ఆర్ఎస్ఐ రమేష్ అది గమనించి వెంటనే ఇంట్లోకి వెళ్లి అతడికి సీపీఆర్ చేశారు. దీంతో అతడు ప్రమాదంనుంచి బయట పడ్డాడు. వెంటనే సదరు పోలీసు అధికారి అంబులెన్స్‌కు సమాచారం అందించి అతడిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. కాగా ప్రస్తుతం శ్యామల్‌రాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

వాగులు చెరువులు చూసేందుకు వెళ్లొద్దు

- పోలీస్ కమిషనర్ సునిల్‌దత్

ఖమ్మం క్రైం, సెప్టెంబరు4: జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, ప్రజలెవ్వరూ వాటిని చుసేందుకు వెళ్లకుండా ఇండ్లలోనే ఉండాలని పోలీస్‌కమిషనర్ సునిల్‌దత్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అదేవిదంగా సెల్ఫీలు, ఫొటోల కోసం వాగుల వద్దకు వెళితే ప్రమాదాల భారీన పడే అవకాశం ఉన్నదని, లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రకటనలో సూచించారు.

భద్రాద్రి హుండీ ఆదాయం రూ.60.81లక్షలు

భద్రాచలం, సెప్టెంబరు 4: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి హుండీలను బుధవారం లెక్కించారు. ఈ లెక్కింపులో దేవస్థానానికి రూ.60,81,779 ఆదాయం లభించింది. రామాలయంలోని హుండీలను ఈవో ఎల్.రమాదేవి సమక్షంలో చిత్రకూట మండపంలో లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో రూ.60,81,779 నగదు, 94గ్రాముల బంగారం, 555గ్రాముల వెండి లభించింది. అలాగే 288 యుఎస్ డాలర్లు, 419 యుఏఈ దీరమ్స్, 60 కెనడా డాలర్స్, 10 ఇంగ్లాండ్ పౌండ్స్ లభించాయి. లెక్కింపు అనంతరం నగదును బ్యాంకు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాన, వరదతో ఆగమాగం

- ఇప్పటి వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 9 మంది మృతి
- మున్నేరు విలయంతో దెబ్బతిన్న వేలాది ఇండ్లు
- శాఖల వారీగా నష్టాలపై అధికారుల అంచనాలు



నేరడ- చింతకాని రహదారిలో కొట్టుకుపోయిన బ్రిడ్జి

ఖమ్మం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అకాలంగా కురిసిన భారీ వర్షాలు, పొంగిన వరదలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు రాష్ట్రంలోనే అతిపెద్ద నష్టం జరిగింది. ప్రధానంగా ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో తుఫాన్ వరద బీభత్సం సృష్టించింది. గడిచిన నాలుగు రోజులుగా ఉమ్మడి జిల్లాలో మొత్తం 9మంది మరణించగా, ఖమ్మం జిల్లాకు చెందిన మరో ఇద్దరు మహబూబాబాద్ జిల్లాలో మరణించారు. బుధవారం టేకులపల్లి మండలానికి చెందిన పశువుల కాపరి గల్లంతయ్యారు.

ఖమ్మం జిల్లా పరిధిలో ఎర్రుపాలెం మండలం భవానిపురానికి చెందిన మలిశెట్టి సాంబశివరావు(20), మధిర మండలం దెందుకూరు గ్రామానికి చెందిన నన్నెబోయిన పద్మావతి(34), కూసుమంచి మండలం నాయకన్‌గూడేనికి చెందిన భార్యభర్తలు షేక్ యాకుబ్(50) షేక్‌సైదాబీ(45), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన కల్లూరి నీలమయ్య(70) తాటి ఆదెమ్మ (68), మణుగూరు సుందరయ్యనగర్‌కు చెందిన రాము(35), టేకులపల్లి మండలం లచ్చగూడెంకు చెందిన బావబామ్మర్దులు కూరం వెంకటేశ్వర్లు(29) దాడ్డా సాయికుమార్(23) మృతిచెందారు. కాగా ఖమ్మంజిల్లా కారేపల్లి మండలానికి చెందిన గంగారాంతండాకు చెందిన వ్యవసాయశాఖ సైంటిస్టు అశ్విని(28), ఆమె తండ్రి మోతిలాల్(50) హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళుతుండగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వాగులో కారుగల్లంతై మృతి చెందారు. కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలానికి చెందిన పశువుల కాపరి సధాకర్ బుధవారం వాగుదాటుతుండగా గల్లంతయ్యాడు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మున్నేరు వరదతో పాటు అనేక గ్రామాలు, వర్షాలు వరదలకు ముంపునకు గురయ్యాయి. ఖమ్మం జిల్లాలో 7,090 ఇళ్లు వరద ముంపునకు గురికాగా, ఖమ్మం పట్టణంలోనే 5750 ఇళ్లు వరద ముంపునకు గురయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, పాల్వంచలో సుమారు 600పైగా ఇళ్లు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తిగా కూలిపోయిన ఇళ్లు, వరదపట్టిన ఇళ్లకుసర్వేబృదాలు సర్వేసాగిస్తున్నాయి. ఇళ్లల్లో బురద ఏర్పడడం, కట్టుబట్టలతో బయటకు రావంతో ప్రతిఇంటికి రూ.లక్షనుంచి 5లక్షల వరకు నష్టం జరిగింది.

కాగా ఉమ్మడి జల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖకు సుమారు రూ.50కోట్ల మేర నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా, ఇందులో ఖమ్మం జిల్లాలో రూ.30 కోట్లు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. తక్షణ మరమ్మతులకు రూ.30కోట్లు అవసరమని ఆర్అండ్‌బీ ప్రతిపాదించింది. ఇందులో బ్రిడ్జిలు, కల్వర్టులు, అప్రోచ్ రోడ్లు దెబ్బతిన్నాయి. పాతర్లపాడు వద్ద బ్రిడ్జి కొట్టుకుపోయింది. నేషనల్‌హైవే రహదారులు కూడా దెబ్బతిన్నాయి. వాటినష్టంపై అంచనావేస్తున్నారు. పంచాయతీరాజ్‌శాఖ రోడ్లు, బ్రిడ్జిలకు తాత్కాలిక మరమ్మతులకు రూ.25కోట్లపైగా నిధుల అవసరం ఉంటుందని అంచనా వేశారు. ట్రాన్స్‌కోకు రూ.10కోట్లు నష్టం వాటిల్లినట్లు అంచనా. ట్రాన్సుఫారాలు, లైన్లు దెబ్బతిన్నాయి. స్తంభాలు పడిపోయాయి. ప్రస్తుతం విద్యుత్ పునరుద్ధరణ పనులు 90శాతంవరకు చేశారు. జిల్లాలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖలు నష్టంపై అంచనాలు సిద్ధం చేస్తున్నాయి..

రైళ్ల రద్దుతో ప్రయాణికులకు ఇక్కట్లు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 4: భారీ వర్షాలు కురవడంతో వరద నీటికి ట్రాక్‌లన్నీ ధ్వంసమై రైళ్ల సేవలు గత ఐదు రోజులుగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తగూడెం నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలు మార్గంలో మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని కె.సముద్రం వద్ద రైల్వే ట్రాక్‌లు పూర్తిగా వరద నీటిని కొట్టుకొని పోయాయి. వీటి మరమ్మతు పనుల్లో రైల్వే అధికారులు, సిబ్బంది పూర్తిగా నిమగ్నమయ్యారు. దీంతో రైల్వే సేవలకు తీవ్ర అంతరాయం నెలకొంది. కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) నుంచి హైదారాబాద్ ప్రాంతానికి వెళ్లే మార్గంలో రాబోయే రెండు రోజుల్లో రైళ్ళు నడిపించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కారణంతో కొత్తగూడెం నుంచి మణుగూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్, సింగరేణి ప్యాసింజర్, విజయవాడ ప్యాసింజర్‌లను రద్దు చేశారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో తిరిగి పలు రైళ్ళను నడిపించేందుకు చర్యలు చేపట్టినట్లు సౌత్ సెంట్రల్ రైల్వే కార్యాలయం తెలిపింది.

పోటెత్తిన బుగ్గవాగు

లోతట్టు ప్రాంతాలు జలమయం

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

కిన్నెరసాని ఉధృతిని పరిశీలించిన ఎస్పీ

గోదావరి ఉధృతిని పరిశీలించిన పాయం


ఇల్లెందులో ఇళ్ల చుట్టూ వరద నీరు


వరదను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం


ఇంట్లోకి చేరిన వరద నీరు


నిండుకుండలా సాయమ్మ చెరువు

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 4: ఇల్లెందు పట్టణంలోని ఇల్లెందులపాడు చెరువు అలుగు ప్రవాహం, కోరగుట్ట ప్రాంతం నుంచి వచ్చే చల్లవాగు ప్రవాహంతో బుగ్గవాగు పొంగి ప్రవహించింది. వరద ప్రవాహంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుగ్గవాగు లోతట్టు ప్రాంతాల్లో నెంబర్-2 బస్తీ, స్టేషన్‌బస్తీ, బస్టాండ్ ఏరియా తదితర ప్రాంతాల్లోకి ఇళ్లలోకి వరదనీరు పెద్ద ఎత్తున చేరడంతో ఇళ్లన్నీ నీటితో నిండిపోయాయి. ఇళ్లన్నీ నీటితో మునిగిపోవడంతో ప్రజలను పునరావాస ప్రాంతాలకు తరలించి భోజన ఏర్పాట్లు చేశారు. నెంబర్-2బస్తీలోని బర్లపెంట ఏరియా ప్రజలను పోలీసులు తాడుసహాయంతో వరదనీటి నుంచి దాటించారు. లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు, పోలీస్ అధికారులు పర్యటించారు. సహాయ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణతోపాటు ఇతర సహాయక చర్యలను తక్షణమే చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ కోటా రవికుమార్, కమిషనర్ యాదగిరి, డీఈ రాజేష్, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు వంకలు

టేకులపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వానకు బుధవారం మండలంలోని ముర్రేడువాగు, నల్లవాగు, పారికలవాగు, రాళ్ళవాగు, శంభూనిగూడెం-బొమ్మనపల్లి గ్రామాల మధ్య, మద్రాసుతండా-కొండంగుల బోడు మధ్య ఉన్న వర్రెలు, వంకలు చప్టాలపై నుంచి పొంగి పొర్లుతున్నాయి. గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చప్టాలు, వాగుల వద్ద టేకులపల్లి ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పహారా కాస్తున్నారు. ఎవ్వరిని నీటిలోకి అనుమతించడంలేదు, మురుట్ల పారికలవాగు చెరువు, లచ్చగూడెం గడ్డిచెరువు, బొమ్మనపల్లి సాయమ్మ చెరువులు మత్తడిపోస్తున్నాయి. చెరువుల వద్ద యువకులు దోమతెరలతో చేపలు పడుతూ కేరింతలు కొడుతున్నారు. స్టేషన్ తడికలపూడికి చెందిన యువకుడు బానోతు లక్ష్మణ్ తూర్పుగూడెం గ్రామ సమీపంలోని వాగులో కట్టుకపోతుండగా తూర్పుగూడెం గ్రామానికి చెందిన కొంతమంది యువకులు రక్షించి ఆ యువకుడిని ఒడ్డుకుచేర్చారు. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో అ ధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

వరద ఉధృతిని పరిశీలించిన ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం: గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కిన్నెరసాని నదికి భారీగా వరదనీరు చేరడంతో లోతట్టు ప్రాంత ప్రజలను నిరంతరం అప్రమత్తం చేసే విధంగా పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ పలు సూచనలు చేశారు. బుధవారం రాజాపురం, యానంబైలు గ్రామాల మధ్య నూతనంగా నిర్మితమవుతున్న బ్రిడ్జి వద్ద కిన్నెరసాని నది వరద ఉధృతిని పరిశీలించి అధికారులకు, స్థానికులకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం కిన్నెరసాని డ్యాం వద్ద ప్రస్తుత పరిస్థితిని అక్కడున్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. కిన్నెరసాని రిజర్వాయర్ గేట్లను తెరిచిన సమయంలో పర్యాటకులను ఎవర్ని అనుమతించవద్దని డ్యాం అధికారులకు సూచించారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎప్పటికప్పుడు వారికి అందుబాటులో ఉండాలని అక్కడున్న అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, పాల్వంచ రూరల్ ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గని వానలు.. పొంగుతున్న వాగులు

ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండలంలో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం పడింది. దాంతో కిన్నెరసాని, జల్లేరు, కోడేలవాగు, తునికిదొన్నెఒర్రె, పాలవాగు, మూలమలుపువాగు, చింతలపడివాగుతో అనేక వాగులు ఉధృతంగా ప్రవహించాయి. నాలుగు రోజులుగా వాగులు తగ్గకుండా ప్రవహిస్తున్నాయి. కిన్నెరసాని బ్రిడ్జిపై నుండి వరద ప్రవహించడంతో ఆళ్లపల్లి మండలానికి, జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచాయి. కర్నెగూడెం మర్లపాడు చెరువు అలుగు కొతకుగురై కూలిపోయింది, చెరువుకు గండిపడే ప్రమాదం ఉంది. లక్ష్మీపురం- ఆళ్లపల్లి మధ్య బ్రిడ్జి రోజు రోజుకు క్రిందకు కుంగిపోతుంది. అటుగా వస్తున్న వరదతో పంటపొలాలు నీటమునిగాయి. మొద్దులచెరువు అలుగు కబ్జాకు గురై చిన్నగా ఉండటంతో చింతోనిగుంపు క్రింద ఉన్న పోలాలు నీటమునిగాయి, రేగడిచెరువు అలులు వరద పెరగడంతో ఇల్లలోకి వదర ఎక్కడ వస్తుందోనని పలు కుటుంబాలు భయం గుప్పిట్లో ఉన్నారు. కిన్నెరసానిలో రెండు ప్రాణాలు పోయాక, బుధవారం అధికారులు అప్రమత్తమైనారని ప్రజల నుండి ఆరోపనలు వస్తున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వానలు, వరదలకు పలు రహదారులు కొతకుగురైనవి. బాటన్ననగర్ నుండి రాయిగూడెం మధ్య రోడ్డు, మర్కోడు-లొద్దిగూడెం, ఆళ్లపల్లి-లక్ష్మీపురం, పాతూరు-పెద్దూరు, బోడాయికుంట- అడవిరామవరం మధ్య రోడ్లు ద్వంశం అయ్యాయి.

గోదావరి ఉధృతిని పరిశీలించిన పాయం

మణుగూరు: మణుగూరు మండలంలోని రామానుజారం శివాలయ ప్రాంతంలో పెరుగుతున్న గోదావరి వరద ఉధృతిని పినపాక ఎమ్మెల్యే పాయం బుధవారం పరిశీలించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వరద ఉధృతి పెరగడంతో గోదావరి నీటిమట్టం దాదాపు 20 అడుగులకు పెరిగింది. దీంతో కొండాయిగూడెం రామానుజారం గ్రామాల మధ్య ఉన్న పుష్కర ఘాట్ మెట్ల వరకు గోదావరి వరద ప్రవాహాలు చేరుకున్నాయి. ఎమ్మెల్యే పాయం ఈ ప్రాంతంలో పెరుగుతున్న గోదావరిని పరిశీలించి స్థానిక జాలర్లకు, ప్రజలకు పలు సూచనలు చేశారు. పెరుగుతున్న గోదావరి దృష్ట్యా నదిలోకి ఎవరూ దిగవద్దని తెలిపారు. అలాగే కొండాయగూడెంలో భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించారు. భద్రయ్య ఇళ్లుపూర్తిగా పాడై పోవడంతో ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు .కొంత ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందించండి: చందా

మణుగూరులో చోటు చేసుకున్న భారీ వరదలకు ప్రాణాలు అరచేత పట్టుకుని జీవించిన ప్రజలు మరలా యధావిధిగా తమ జీవన విధానాన్ని పొందెందుకు సర్వం కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందించాలని ఆదివాసీ సంఘాల జేఏసీ జాతీయ నాయకులు చందా లింగయ్యదొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఈ విషయంపై తహశీల్దార్ రాఘవ రెడ్డికి ఆదివాసీ నాయకులు కోటి తదితరులతో పాటు వినతి పత్రాన్ని అందించారు. బాధితులను పరామర్శిస్తూ ఆర్థిక సాయం అందిచక పోవడం సిగ్గుచేటని ఆరోపించారు. వరదల నుంచి మణుగూరును సేవ్ చేయాలని ఆలెం కోటి, నాగయ్య తదితరులు నిరహార దీక్షలు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి ముంపు ప్రాంతాలకు ఐదు వేల కోట్లను మంజూరి చేయడం పట్ల బాధితుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హైడ్రా చట్టం అమలు చేస్తున్న సీఎంను సేవ్ మణుగూరుపై కూడా ప్రత్యేకంగా కలువనున్నట్లు చందా పేర్కొన్నారు. మణుగూరు ముంపునకు గురి కావడానికి గల కారణాలను అధికారులు తేల్చాలని, ఇవి పునరావృతం కాకుండా ఉండేందుకు తగిన చర్యలను చేపట్టాలన్నారు. సింగరేణి, రెవెన్యూ, మండల అభివృద్ధి అధికారుల సమన్వయంతో పనిచేసి పొరపాట్లు ఎక్కడున్నాయి అన్న విషయాన్ని గ్రహించి వాటిని సరిదిద్దే పనులు చేపట్టాలన్నారు. 10 సూచనలతో కూడిన వినతి పత్రాన్ని మండల రెవెన్యూ అధికారి రాఘవ రెడ్డికి అందించారు. భవిష్యత్తులో వరద నివారణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని ఆయన సూచించారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని చందా లింగయ్య తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలెం కోటి, వాసం రామకృష్ణ, గొగ్గలి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


మత్తడి పోస్తున్న సాయమ్మ చెరువు


ఆళ్లపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కిన్నెరసాని


గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న పాయం


వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

ఐదుగురిని మింగిన వరద

రెండు ప్రాంతాల్లో సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వకు గండి

పెద్దవాగు ప్రాజెక్టుకు తాత్కాలికంగా ఏర్పాటుచేసిన రింగుబండ

కొట్టుకుపోయిన రహదారులు.. మరమ్మతులకు మోక్షం ఎన్నడో..?

దెబ్బతిన్న వ్యవసాయ పంటలు.. ఆందోళనలో రైతులు

కొత్తగూడెం, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ వారంలో కురిసిన వర్షాల వల్ల వరదలు భారీగా వచ్చి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం ఐదుగురు వ్యక్తులను వాగులు, వంకలు, వరద ప్రవాహంతో కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. గత శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు విపరీతంగా కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో చిన్న చిన్న వాగులు సైతం పొంగి ప్రవహించాయి. ప్రాజెక్టులు సైతం ఉధృతంగా వరద పోటు రావడంతో ఒక్కసారిగా ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వాగుల్లో వరద మరింతగా పెరిగిపోయింది. దీంతో అపారమైన నష్టం సంభవించింది. అశ్వాపురం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పశువుల కాపర్లు అయిన వృద్ధులు కల్లూరి నీలయమ్మ (70), తాటి ఆదెమ్మ (68) శనివారం అర్ధరాత్రి వచ్చిన వరద వల్ల తోగువాగు పక్కనే గుడిసె వేసుకుని అక్కడ పశువులు, మేకలు కాపలగా ఉండి గాఢమైన నిద్రలో ఉండగా వచ్చిన నీటి ప్రవాహంతో ఆ వాగులో వృద్ధులు కొట్టుకుపోయి మృతి చెందారు. ఆ వాగులో కొద్ది దూరంలో మృతదేహాలు లభించడంతో కుటుంబసభ్యులు తీసుకుని వెళ్లిపోయారు. మణుగూరు పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన దివ్యాంగుడు నందికోళ్ల రాము నిద్రిస్తున్న సమయంలో వాగు ఉధృతంగా రావడంతో కొట్టుకునిపోయి మృతి చెందాడు. ఈ ముగ్గురికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఒక్కక్కరికి రూ. 5లక్షల చొప్పున ఆ కుటుంబసభ్యులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చెక్కుల రూపంలో అందచేశారు. ఇదిలా ఉండగా టేకులపల్లి మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, దొడ్డ సాయికుమార్ అనే ఇద్దరు యువకులు ఆదివారం గుండాల మండలంలోని వేపలగడ్డ దగ్గర ఉన్న సమ్మక్క- సారక్క గద్దెల వద్దకు వెళ్లి మొక్కు తీర్చుకుని తిరిగి వస్తుండగా ఆళ్లపల్లి మండలంలోని రాయపాడు గ్రామసమీపంలో కిన్నెరసాని బ్రిడ్జిపై నుంచి పెద్ద ఎత్తున నీరు ప్రవహించడంతో ద్విచక్రవాహనంపై వస్తున్న వారు ప్రమాదవశాత్తు కిన్నెరసాని వాగులో పడి గల్లంతు అయ్యారు. ఆ రోజు గల్లంతైన ఆ ఇద్దరు మంగళవారం సాయంత్రం లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారుచెలక సమీపంలో తోకబందాల ప్రాంతంలోని కిన్నెరసాని వాగు పక్కన మృతదేహాలు లభించాయి. దీంతో పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు మృతదేహాలను వెతికి పట్టుకున్నారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు ఈ వరదల మూలంగా ఐదుగురు మృత్యువాతపడ్డారని తెలుస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రుల చేతుల మీదుగా ఆగస్టు 15వ తేదీన నీటిని ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టు (ఎత్తిపోతల పథకం) ప్రధాన కాల్వకు రెండుచోట్ల గండిపడి నీరు బయటకువెళ్లిపోయింది. గత ఆదివారం పాల్వంచ ములకలపల్లి మండలాల మధ్య ఉన్న బంద్రుగూడెం సమీపంలోని కొత్తూరు వద్ద ఫేస్-2 వద్ద నిర్మించిన సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు ప్రధాన కాల్వకు సుమారు 25మీటర్ల పొడవున గండిపడింది. దీంతో ఆ కాల్వలో ఉన్న నీరు పెద్ద ఎత్తున పొంగి ప్రవహించడంతో ఆ సమీపంలో ఉన్న రైతులు వేసుకున్న పంట పొలాలు మునిగిపోయి దెబ్బతిన్నాయి. సుమారు వంద ఎకరాల్లో పత్తి పంట దెబ్బతినడమే కాకుండ మరో వంద ఎకరాల్లో ఇతర పంటలైన వరి, మిరప తదితర పంటలకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మంగళవారం చంద్రుగొండ మండలం మద్దుకూరు వద్ద సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వకు గండిపడి నీరంతా కొట్టుకుపోయి ఆ ప్రాంతంలోని పంటలకు నష్టం వాటిల్లింది. అశ్వారావుపేటలోని పెద్దవాగు ప్రాజెక్టుకు గతంలో వచ్చిన భారీ వర్షాల మూలంగా గండిపడిన విషయం తెలిసిందే. నీరంతా పోవడంతో తాత్కాలికంగా ఆ గండిని పూడ్చేందుకు నీటిపారుదలశాఖాధికారులు రూ. 3.50కోట్ల వ్యయంతో రింగ్‌బండను ఏర్పాటుచేశారు. ఆదివారం వచ్చిన భారీ వర్షం వరదల వల్ల పెద్దవాగు ప్రాజక్టుకు ఏర్పాటుచేసిన రింగుబండకూడా కొట్టుకుపోయింది. జిల్లా వ్యాప్తంగా సుమారు అన్నిరకాల పంటలు 20వేల ఎకరాల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది పంట నష్టానికి ఎకరానికి రూ.10వేల చొప్పున నష్టపరిహారాన్ని అందచేస్తామని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా వరదల మూలంగా రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. జిల్లావ్యాప్తంగా 26కల్వర్టులు కొట్టుకుపోయాయి. విద్యుత్ శాఖకు జిల్లాలో సుమారు రూ.32.70కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు తెలు స్తోంది. మొత్తం మీద వరదుల రానున్న కాలంలో భారీగా వర్షాలు రావడంతో భారీగా నష్టం వాటిల్లే అవకాశాలు లేకపోలేదు. జిల్లాలో చెరువులకు గండ్లు పడ్డాయి. అది కూడా భారీగా నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

పవిత్ర గోదావరి నదికి పంచ హారతుల సమర్పణ


హారతి సమర్పిస్తున్న ఈవో రమాదేవి

భద్రాచలం, సెప్టెంబరు 4: వరుణుడు, గోదారమ్మా శాంతించాలని అతి వృష్టి, అనావృష్టి బారిన ప్రజలు పడకుండా అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో గోదారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం పవిత్ర గోదావరి నదికి ముందుగా పసుపు, కుంకుమ, సారె, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గోదారమ్మకు పంచ హారతులను భద్రాద్రి దేవస్థానం వైదిక సిబ్బంది సమర్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్‌లతో పాటు వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దుమ్ముగూడెం, సెప్టెంబరు 4: మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పదహారు మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ అశోక్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఈదయ్య, ఎంపీవో రామకృష్ణ, ఆర్‌ఐలు లక్ష్మయ్య, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పాయం పరామర్శ

పినపాక, సెప్టెంబరు 4: మండలంలోని పాండురంగాపురం జానంపేట గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కట్టం సాయి, కొమరం సమ్మక్క కుటుంబాలను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు సాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందచేశారు. కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటా మని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం అత్యంత బాధాకరమని అన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. యువజన నాయకుడిగా సాయి ఎంతో కష్టపడేవాడని అన్నారు. మరణం తీరని లోటన్నారు. మృతికి సంతాపం తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు అమలు చేసే బాధ్యత మీదే: డీఎస్పీ

చంద్రుగొండ, సెప్టెంబరు 4: గణేష్ ఉత్సవాల సమయంలో ఉన్న నిబంధనలు కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత ఆయా పరిధిలోని సీఐ, ఎస్ఐలదేనని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ అన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో పలు గ్రామాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాలను ఏర్పాటు చేయదలిసిన వారు ముందగా కమీటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమిటీ సభ్యుల విరాలను స్థానిక స్టేషన్‌లో నమోదు చేయించాలని, అనంతరం అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సొంత అజెండాతో పనిచేయొద్దు: ఎమ్మెల్యే

జూలూరుపాడు, సెప్టెంబరు 4: ఎంతో కష్టపడి సాధించుకున్న ఇందిరమ్మ రాజ్యంలో అధికారులు ప్రజల బాగోగుల విసయంలో పారదర్శకంగా వ్యవహరించాలని, సొంత అజెండాతో పనిచేస్తే సహించేది లేదని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వం 20 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్దిదారులకు పంపిణీ చేశారు. కారేపల్లి మండలానికి చెందిన యువ శాస్త్రవేత్త అశ్విని మృతికి సంతాపాన్ని తెలుపుతూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు సమన్వయంతో ప్రజలకు సేవ చేయాలని పేర్కొన్నారు. తాను అధికారులతో స్నేహపూర్వకంగా మెలుగుతానని, అధికారులు నిర్దేశించిన పనులు, ప్రజా సమస్యలను పరిష్కరించే విసయంలో నిర్లక్ష్యం వహిస్తే అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవటానికి కూడా వెనకాడనని హెచ్చరించారు.

'సేవాభావంతో పనిచేయండి'


రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, సెప్టెంబర్ 4: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవాభావం, అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వైద్యులు, సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి, సిబ్బందితో సమీక్షించారు. ఆసుపత్రిలో సిబ్బంది, వైద్యుల సంఖ్య, మందుల పరిస్థితి, ఓపీ, ఇతర పరీక్షలు ఏ విధంగా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలను సత్వరమే పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిబ్బంది రోగులపట్ల మర్యాదక ప్రవర్తించాలని కోరారు. ఆసుపత్రిలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

కొత్తగూడెం,సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సెల్ఫీల కోసం వాగులు, వంకలు, నదుల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురికావొద్దని, వరద నీటితో నిండిపోయిన రోడ్లను దాటడానికి ప్రయత్నించవద్దని ఎస్పీ రోహిత్‌రాజ్ తెలిపారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా రోడ్లు బురదమయంగా మారాయని, వాహనాల టైర్లు జారీ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, కావున వాహనదారులు నెమ్మదిగా తమ వాహనాలతో ప్రయాణించాలన్నారు. భద్రాచలం వద్ద గోదావరి నది పెరుగుతుందని కావున పరిసర ప్రాంత ప్రజలు, అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.

మృతుల కుటుంబాలకు పరిహారం

టేకులపల్లి, సెప్టెంబరు 4: కిన్నెరసానిలో గల్లంతై మృతిచెందిన మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కోరం వెంకటేశ్వర్లు, దొడ్డా సాయికుమార్ కుటుంబాలకు పరిహార చెక్కులను అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం లచ్చగూడెంలో మృతుల కుటుంబాలకు అందచేశారు. ఒక్కొక్క కుంబానికి రూ.5లక్షల చొప్పున రూ.10లక్షల చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ మృతుల కుటంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ, సహకారాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

పాల్వంచలో గంజాయి పట్టివేత

పాల్వంచ, సెప్టెంబరు 4: పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం ఒరిస్సా రాష్ట్ర మల్కాజ్‌గిరికి చెందిన బైపారి, లాలూతంతీలు ఒరిస్సా నుంచి కొత్తగూడెంకు గంజాయి తరలించడానికి సిద్దపడ్డారు. ద్విచక్ర వాహనంపై బయలుదేరి పాల్వంచ శివారులోకి ప్రవేశించగానే సోములగూడెం క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పాల్వంచ రూరల్ పోలీసులు వారిని అనుమానించి వారి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వారివద్ద ఉన్న బ్యాగులో 10 కేజీల ఎండు గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. దీంతో వారిరువురినీ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 2లక్షల యాభై వేలు ఉంటుందని, ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి: ఎంపీ

బూర్గంపాడు, సెప్టెంబరు 4: పార్లమెంటు నియోజకవర్గంలో వరదలకు దెబ్బతిన్న రోడ్ల మరమత్తులను తక్షణమే చేపట్టాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ సూచించారు. బుధవారం బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక ఐటీసీ గెస్ట్‌హౌజ్‌లో భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావుతో కలిసి ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎంబీ ఈఎన్‌సీ మోహన్‌లాల్, భద్రాచలం ఎమ్మెల్యేతో కలిసి భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు పర్యటించి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో 24గంటలు ఇసుక లారీలు తిరగడంతో భద్రాచలం నుంచి వెంకటాపురం వెళ్లే రోడ్డు దెబ్బతిన్నదని దీంతో ఆదివాసీలు కంకర తెలిన రహదారిపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తక్షణమే పనులు చేస్తామని హామీ ఇచ్చారు. పోలవరం బ్యాక్ వాటర్ బాధితులకు శాశ్వత పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ బలరాం తెలిపారు.

రూ.25లక్షల పరిహారం చెల్లించాలి: రేగా

అశ్వాపురం, సెప్టెంబరు 4: ఇటీవల వరదలో కొట్టుకు పోయి మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆయన వరదభాదిత కుటుంబాలను పరామర్శించారు. వెంకటాపురం గ్రామానికి చెందిన మృతులు నీలమయ్య, ఆదెమ్మ కుటుంబాలకు ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం గొందిగూడెం పంచాయతీలో బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కంటితుడుపు చర్యగా కాకుండా బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయిలో పరిహరం అందజేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, నాయకులు జాలె రామకృష్ణారెడ్డి, మర్రి మల్లారెడ్డి, సూదిరెడ్డి గోపిరెడ్డి, సుధీర్, వెంకటరమణ, చందూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి: ఎస్ఐ

కరకగూడెం, సెప్టెంబర్ 4: మండలంలో త్వరలో నిర్వహించనున్న గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతులు తప్పకుండి తీసుకోవాలని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ రాజేందర్ మాట్లాడుతూ.. గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, నిమజ్జనం చేసే తేదీ, ప్రదేశం మొదలైన సమాచారంతో పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని.. విద్యుత్ శాఖ అనుమతితో మండలపాల నిర్వాహుల ఫోన్ నెంబర్లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలన్నారు. మండలపాల వద్ద డీజేలకు అనుమతి లేదని రాత్రి 10గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహాల ఏర్పాటు చేసుకొని ఉత్సవాల చేసుకునేందుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానం అమల్లో ఉందని ఎస్ఐ పేర్కొన్నారు.